ఆదివారం

ప్రజాశక్తి

సెప్టెంబర్ 19, 2004



కౌన్‌బనేగా...క...'రోడ్'పతి

హ్యాపీ బర్త్‌డే

గాయత్రిరాజ్
2సం॥, 19.9.2002
రాజ్యలక్ష్మిరాజ్-అశోక్‌రాజ్
రామచంద్రాపురం-మెదక్

(19-9-2004 నుంచి 25-9-2004 వరకు)

కడియం రజని
10సం॥, 19.9.1994
రోజా-కోటేశ్వరరావు
మంచాల-గుంటూరు

కె. ఆదిత్య ప్రసాద్
5సం॥, 19.9.1999
అర్పిత-అయోధ్య
చెన్నాపురం-సికింద్రాబాద్

ఎస్. వర్షిత
1సం॥, 19.9.2003
పద్మజ-గిరిప్రసాద్
భద్రాచలం-ఖమ్మం

విద్యుత్ తేజ
4సం॥, 19.9.2000
పద్మజ-గిరిప్రసాద్
భద్రాచలం-ఖమ్మం

కె.శిరీష
సెప్టెంబర్-19
లక్ష్మి-అయ్యబాబు

టి. హర్షిణి
1సం॥, 20.9.2003
సునీత-గంగాధర్
విజయవాడ

సాయిరాహుల్-ఉమా రిషిత
3సం॥, 20.9.2001
సత్యశ్రీలక్ష్మి-శ్రీనివాస్
మాధవధార-విశాఖ

బి. కార్తిక్ యాదవ్
1సం॥, 20.9.2003
నవనీత-శ్రీనివాస్
బొల్లారం-సికింద్రాబాద్

బి. క్రాంతికుమార్
6సం॥, 20.9.1998
ప్రసన్న-మాధవరావు
కందుకూరు-ప్రకాశం

సి. కార్తికేయ
4సం॥, 21.9.2000
మంజుల-వేణు
ఖమ్మం

సాయి దీక్షిత
సెప్టెంబర్-21
హేమలత-రామకృష్ణ

ఎమ్.వి.ఎస్.కె.వి.రాముడు
5సం॥, 21.9.1999
పద్మకుమారి-సోమనాథ్ బాబు
విజయవాడ

కె. శ్రీజ
2సం॥, 21.9.2002
శిరీష-శేఖర్
కొత్తగూడెం-ఖమ్మం

జి.దేవీ చరణ్
2సం॥, 22.9.2002
సంధ్య-రాము
రణస్థలం-శ్రీకాకుళం

బి.వంశీకృష్ణ
7సం॥, 22.9.1997
లక్ష్మీదేవి-సూర్యనారాయణ
నిమ్మలకుంట-అనంతపురం

భవాని(నీలు)
1సం॥, 22.9.2003
మీనా-కుమారస్వామి
మచిలీపట్నం-కృష్ణ

చొప్పల దినేష్
5సం॥, 22.9.1999
సునీత-గోపి
అంతర్వేది-తూ॥గో॥

పి.ఎన్.శ్రావణి
సెప్టెంబర్-23
సుకన్య-నరసింహ
మారుతీనగర్-హైదరాబాద్

అనీష
1సం॥, 23.9.2003
స్వరూప-సత్యనారాయణ
రావినూతలపాడు-ఖమ్మం

బి. సృజన
2సం॥, 23.9.2002
పరిమళ-మధు
విశాఖపట్నం

మరి కొన్నిఫొటోలు మూడవ కవర్ పేజీలో చూడండి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



పాఠ్యపుస్తకాలకు మతకల్మషం

ఆలోచింపజేసింది

సెప్టెంబర్ 5వ తేదీ సంచిక కవర్‌స్టోరీ "పాఠ్యపుస్తకాలకు మత కల్మషం" రచించినవారికి కృతజ్ఞతలు. 'మేరా భారత్ మహాన్-హిందూ ముస్లిం భాయీ భాయీ' అన్నారు మన పెద్దలు. కానీ 1998లో అధికారంలోకి వచ్చిన పాలకులు మతకల్మషాన్ని అనేకవిధాలుగా సామాన్యప్రజలపై రుద్దారు. మరీ ముఖ్యంగా పాఠ్యాంశాల ద్వారా పిల్లల బుర్రలకెక్కించడం ద్వారా నేటి బాలలను రేపటి మతతత్వ హింసావాదులుగా తీర్చిదిద్దాలనే రాజకీయకుట్ర పన్నారు. ఈ అంశాలను చాలా చక్కగా రూపొందించి మాకు అందించారు. ఇటువంటి భావాలను ఎక్కించే పాఠ్యాంశాలను వెంటనే తొలగించే ఆజ్ఞను కేంద్రప్రభుత్వం ఇవ్వాలి.

– డి వీరేశలింగం, వాజేడు, ఖమ్మంజిల్లా

కవర్‌స్టోరీ హైలైట్

కవర్‌స్టోరీ ఒక చరిత్ర పరిశోధకుడితో రాయించడం సముచితంగా ఉంది. అది చదివాక ఐదేళ్ళపాటు అధికారంలో ఉన్న ఎన్‌డిఏ అప్పటి సంఘపరివార్ శక్తులు విద్యావిధానాన్ని ఏవిధంగా తమ భావజాలానికి వినియోగించుకున్నదీ తెలిసింది. ఆదేరీతిన 'ఎన్‌సిఇఆర్‌టి' టెక్స్ట్‌పుస్తకాలలో జరిగిన కాషాయీకరణను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని చరిత్రకారులు పిలుపునివ్వడం అభినందనీయం. జీవనశైలిలో 'మూఢనమ్మకాలు తొలిగినయా?' వ్యాసంలో మూఢనమ్మకాల గురించి చాలా చక్కగా వివరించారు. ఆ గుట్కాలు-నోటి క్యాన్సరు' గురించి ఆరోగ్యం పేజీలో డాక్టరుగారి వ్యాసం గుట్కాప్రియులకు హెచ్చరిక.

– కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట్, వరంగల్‌జిల్లా

చరిత్రకు కాషాయం

అనుబంధంలో వచ్చిన విషయాలన్నీ ఒకదానికొకటి పోటీబడి బాగున్నాయి. కార్టూన్‌కదంబం, కవర్‌స్టోరీ ఈ సంచిక విశేషాలు. సైన్సు సామాజిక శాస్త్రాలు, 1998నాటి అప్రజాస్వామిక ప్రభుత్వం ఏకంగా చరిత్రంతటికీ తమ కాషాయపురంగు పులిమారు. సావర్కార్ విషయం, గాడ్సే చిత్రపటం విషయంలో వాళ్ళు వ్యవహరించిన తీరు మళ్ళీ పునరావృతం కాకుండా చేయాలి.

– సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడరూరల్

రియల్‌స్టోరీ

పిన్న వయస్సులోనే పెద్దల ప్రశంసలు పొందిన చైల్డ్‌స్విమ్మర్ చేపపిల్ల సురేఖ నిజంగా అభినందనీయురాలు. తోటివారికి ఆదర్శప్రాయురాలు.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

కవితలు బాగున్నాయి

'వెనుజులా...వెనుజులా', 'త్రివర్ణ పతాకమా...నేనూ దేశభక్తుణ్ణే' కవితలు రెండూ బాగున్నాయి. "జీవనదులను, బంగాళా ఖాతాన్ని చూసిన కళ్ళతో నా దేశ అంతరంగాన్ని చూస్తున్నాను" అంటూ దేశభక్తిని చాటిచెప్పిన మేటి కవిత అది. కవులను అభినందిస్తూ...

– జి ఆర్ కూర్మే, ఆదిలాబాదు

తెలుగువేణి

ఆగష్టు 29 సంచిక కవర్‌స్టోరీ 'తెలుగువేణి కృష్ణవేణి' ఆద్యంతం చదివింపజేసింది. కృష్ణానది గురించి ఎన్నో చారిత్రక విషయాలు తెలియజేశారు. ఐదుజిల్లాల్లో ఏర్పాటుచేసిన స్నానఘట్టాల గురించి, పుష్కరాలు-వాటి చరిత్ర, ప్రాముఖ్యతలు చాలాబాగా చర్చించారు. ఈ విషయాలు మమ్మల్నెంతో ఆకట్టుకున్నాయి.

– నందాల శివ, సర్వేలు,
నల్లగొండజిల్లా

ఆలోచింపజేసింది

తెలుగింటి విరిబోణి, తెలుగువారి అలివేణి కృష్ణవేణి గురించి కవర్‌స్టోరీ కథనం అద్భుతంగా ఉంది. పుష్కరాలను గూర్చిన చారిత్రకనేపథ్యం, పురాణాలలో వివరణ, కృష్ణానది పుట్టుక నుంచి సముద్రంలో కలిసేవరకు గల పరీవాహప్రాంతం గురించి చాలా మంచి వివరణ ఇచ్చారు. ముఖ్యంగా హేతువాదులు, భౌతికవాదుల వాదన ఆలోచింపజేసింది. పుష్కరాల సందర్భంగా ఆరోగ్యజాగ్రత్తలు చాలా చక్కగా ఇచ్చారు. ఇంత అద్భుత సమాచారమిచ్చినందుకు కృతజ్ఞతలు.

– పి ప్రేమ్‌కుమార్, టీచర్,
వెల్దండ, మహబూబ్‌నగర్‌జిల్లా

మనలో మాట

గురివిందకు శలవు...ట !

గురివిందగింజ తన నలుపు తానెరుగదు అనే సామెతను ఎన్నిసార్లో ఉపయోగించాం.

ఎందరెందరిమీదో ప్రయోగించాం.

ముఖ్యంగా ఆత్మస్తుతీ పరనిందగాళ్ళకు బాగా గురిచూసి పేలుస్తాం కూడా!

అలా ఎన్నో ఏళ్ళుగా ఈ సామెతను తెగ అరగదీశాం. దాంతో...ఇక అది తనకు ఆ పదవి నుంచి రిటైర్‌మెంటు ఇప్పించమని ఒకటే మొత్తుకొంటోంది.

పోలికల శాస్త్రాన ఇకపై తనకు శలవిప్పించండని ఒకటే గొడవ. ఇంకెన్నాళ్లు తన కింది నలుపునద్దంపెట్టుకుంటారని ఎంతలేసి మాటలందని...?!

ఇన్నివేల సంవత్సరాలనుండి దానితో పోల్చి ఎంతెంత గొప్పగొప్పోళ్ళ ఇజ్జత్ తీశాం. వాళ్ళ రంగు బట్టబయలు చేసినకొద్దీ దీని నలుపు వెలిసిపోతోంది. మన పత్రికలు, రచనలలో అంతటి ఫుల్‌పవర్‌ఫుల్ స్వముచ్ఛేశ్వరులను వర్ణిస్తిమి కదా!

అద్గదీ దాని ఏడుపు...గోడు...ఆభోరు...!

మరందుకే అది తనను మించిన వారొచ్చేశారు కదా... ఇకనుంచైనా తన మానాన తననొదిలిపెట్టమనుట!

అలా సింబాలిజంసైన్సు నుంచి తననూ... తనజాతిని గనుక ఒమిట్ చేయకపోతే తానే చరిత్రను తిరగరాస్తానంటోంది.

మొన్నటిదాకా పీకలమొయ్యా అధికారంలో మునిగి మునిగి రాజ్యమేలినవారు నేడు ఓడి ప్రతిపక్షులయ్యేటప్పటికి అవే పనులు తప్పులుగా నేరాలుగా ఘోరాలుగా పసుపురంగు దొరలు లబలబమంటుంటే అది శలవడగడంలో తప్పేముంది?

తన ఏలుబడిలో రాయలసీమలో పారినది అత్తరుగా నేడు పారేది నెత్తురుగా నోరు వాయిచేసుకుంటున్నవారిని చూసి అలా అనదా మరి!

గాంధీ హత్యమరకలంటిన చేత్తోనే జాతీయజెండా పట్టుకుని దేశభక్తులమంటూ తిరంగాయాత్రలను చేసేవారిని చూశాక అదట్లా అడగదామరి !!

ఒకసారి దేవతగా మరోసారి దెయ్యంగా కనబడినట్లు వీరంగవేసే వేర్పాటువాద గణాచారుల ఉవాచలు విన్నాక అలా డిమాండ్ చేయదా మరి!!! ❖

ఈ సంచికలో . . .

ఔరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతిసంగతులు . . .	15
నువ్వద్ది . . .	16
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

సంఘర్షణ

కథ ... 8, 9

వృద్ధ యువతి

రియల్‌స్టోరీ ... 14

నైనిటాల్ నగరం

టూరిస్ట్‌గైడ్ . . . 21

సృజనాత్మకతను ప్రదర్శించే చిత్రకారుడు

కళాసాహితి . . . 22, 23

ఓరా!

ఓహో...ఏమి టేస్టూ...!

ఆ గుజరాతీ తల్లి వండిన వంటకాలకు, వడ్డించిన ప్రేమకు ఉబ్బితబ్బిబ్బయ్యాడా జర్నలిస్టు. మీ వంట మహా భేషుగ్గా ఉన్నాయని చెబుదామంటే ఫ్రెంచి, ఇంగ్లీషు భాషలు తప్ప గుజరాతీ మాటరాదు ఈ ఫొటో జర్నలిస్టుగారికి. అందుకే ఆయనిలా భరతనాట్య భంగిమలో ఆహా ఏమి టేస్టూ అని అభినయించేశాడు. మరందుకే అన్నారు మూకాభినయం (మైమ్) ప్రపంచభాష అని. ఇంతకీ ఆయనెవరంటే... ప్రపంచమంతా ప్రముఖ ఫొటోజర్నలిస్టుగా ఎరిగిన హెన్రీ కార్టియర్ బ్రెస్సన్ గారు. ఈయన ఇండియాకొచ్చినప్పుడు అహ్మదాబాద్‌లోని ఆయన మిత్రుడు దశరధ పటేల్ ఇంట్లో దిగాడు. ఆయన రుచి చూసిన భారతీయ వంటకాలు, వడ్డించిన ఆ తల్లి ఆప్యాయతలకూ దంగయ్యి...కృతజ్ఞతాపూర్వకంగా మీకేవన్నా తెచ్చిపెట్టమంటారా అని సదరు సైగలభాషలో అడిగాట్ట. అలాంటివేవీ తెవొద్దందావిడ. ఇంకేంచెయ్యాలో తోచక ఆ ఫొటో జర్నలిస్టు ఆనందతాండవం చేశాట్ట! ఆ రీతిన తన ఆనందాన్ని ఫొటోజెనిక్ చేశాడు మరి.



ధూమపాన శకటం

"ధూమ్రపాన్, ధుంకూనాక కరూ నాకా" అని మరాఠీ భాషలో ముంబయ్‌లోని ప్రతీ బస్సులో రాస్తారు. అలాంటిది అదే ముంబయ్‌లో ప్రత్యేకించి సిగరెట్టు, బీడీ, చుట్ట కాల్చేవారికోసం ప్రత్యేకంగా ఓ ఎయిర్‌కండీషన్ బస్సు నడుపుతున్నారు. "పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్" అని ఎవరో చమత్కరించారు. దానితో దున్నపోతు పుటకనుంచి తప్పించుకుందామని సిగరెట్టు ముట్టించబోతే "బహిరంగప్రదేశాల్లో ధూమపాన నిషేధ చట్టమొచ్చిపడింది. మన గిరీశమింగ్లీషు ప్రకారం ఈ "అక్స్ బర్న్ ఎస్కేపర్స్" తెగ బాధపడిపోయారు. యమ ఇబ్బందిపడిపోయ్యారు. వీరి ఈ బాధ చూడ్లేక చూడ్లేక...'గాడ్‌ఫ్రే ఫిలిప్స్' అనే ఓ ప్రముఖ సిగరెట్ల కంపెనీవారు ఏకంగా శీతలీకరణాయంత్ర సహిత షట్చక్ర శకటం(కంగారడకండి బాబో...ఎయిర్‌కండీషన్డ్ లాంజ్)ని ఏర్పాటుచేశారు. పోన్లేండి...పొగ తాగితాగి దున్నపోతై పుట్టకుండాను వాళ్లుంటారు. పొగతాగనివారు బతుకుజీవుడాని హాయిగా తమ శ్వాస తాము పీల్చుకుంటారు.



"దేశవాళీ ఎలుకను ఒకపీకు పీకుము"

ఆ మధ్య ఒక తెలుగుభాష వీరాభిమానికి "కంప్యూటర్‌ను, దాని సాంకేతికపదాలను తెలుగైజ్ చేస్తే..." అనిపించిందంట. 'ఎలుక ఎడమచెవి మెలిపెట్టి ఒక్కపీకు పీకుము'(క్లిక్ ద మౌస్ లెఫ్ట్ బటన్) అనుకుని తెగ నవ్వుకున్నాట్ట. పాపమా కార్టూనిస్టు జోగ్గా రాస్తే, దానిని తిరుపతిలోని రాష్ట్రీయ సాన్‌స్క్రీట్ విద్యాపీఠ్ వారు నిజం చేశారు. కంప్యూటర్‌ను 'సంగనాకమ్ యంత్రమ్' అని, మౌస్‌ని 'మూషికం' అని అనాలంటున్నారు. సదరు యంత్రమ్ పై ఎమ్‌టెక్ ఇన్ కంప్యూటర్ సైన్సెస్ కోర్సుని ప్రారంభించారు. అయితే దానిలో పట్టభద్రులైన ఎమ్‌టెక్స్‌ను "ఆచార్యా" అనబోతున్నారుట!!

కార్టూన్ కదంబం


లిబర్హాన్ కమిషన్
బాబ్రీ విధ్వంసంలో ఉమ, అద్వానీలకు ప్రత్యక్ష పాత్ర


ఎక్కడికెళ్ళినా దాన్ని వెంట తీసుకెళ్తున్నాడు మేడం...
బిజెపి అధ్యక్ష పదవి
ఉమ నాకు ఎసరు పెట్టుడు: వెంకయ్య

కెసిఆర్

విదేశీచానల్ ను చూసే కావచ్చు. ఓ మెటాలిక్ వాయిస్, ఎందరికో ఇష్టమైన స్టార్ యాంకరింగ్‌లో "కౌన్ బనేగా కరోడ్‌పతి" బాగా ఆకట్టుకుంది. అనేక చానల్స్ ఈ తరహా క్విజ్‌కార్యక్రమాలను రూపొందించుకున్నాయి. కౌన్ బనేగా కరోడ్‌పతి నుండి బ్రెయిన్ ఆఫ్ ఆంధ్రా వరకూ ఈ క్విజ్ గేమ్ కార్యక్రమాలు జనరల్ నాలెడ్జి-ఐ.క్యూ.-విజ్ఞానం-జ్ఞాపకశక్తి-ధారణశక్తి ఇలా తదితర పేర్లతో చెలామణీలోకి వచ్చాయి. దీనిని విద్యాసంబంధమైన, మేధోపరమైన అంశంగా అందరూ పరిగణించారు. కానీ మార్కెట్టీకరణకు కాదేదీ అనర్హం అన్నట్లుగా మేధస్సుకీ జనరల్‌నాలెడ్జికీ డబ్బుజబ్బు, జూదంగబ్బు అంటుకున్న వైనమిది. అడిగిన క్విజ్‌ప్రశ్నకు ఖరీదు లేబుల్, ఆ ఖరీదు అంచలంచెలుగా పెరగడం... ఆ డబ్బు అంకెలకు సున్నాలు పెరుగుతున్నకొద్దీ తెలిసిన జవాబుకూడా చెప్పలేక హాట్‌సీటులోని వ్యక్తి ముఖంలోని బేలతనం ప్రేక్షకులకు వినోదమవుతోంది. ఆ వినోదం మాటున మరెంతో వ్యాపారం ఉంటోంది. పైకి కనిపించని ఆ పార్శ్వాన్ని ఎత్తిచూపిన కవర్‌స్టోరీ ఈ వారం అందిస్తున్నాం.

కౌన్ బనేగా...క...'రోడ్'పతి

హర్షిత్ మోహన్

ఏరా రవి ఈ విషయం తెలుసా! అంటూ వచ్చాడు నా ఫ్రెండ్ శీను . ఏ విషయం అంటూ నేను ఎదురు ప్రశ్నించాను.

స్టార్ ప్లస్‌లో కెబిసి మళ్ళీ వస్తోందటగా! అన్నాడు.

ఎవరు చెప్పారు? ఎదురు ప్రశ్నించాను. అదేంటీ ఈ మధ్య పేపర్లో వచ్చింది కదా నువ్వు చూడలేదా? అన్నాడు వాడు.

కెబిసి మళ్ళీ వస్తే మనకేంటి లాభం? అన్నాను నేను.



ఇంతకుముందు కెబిసి వచ్చినప్పుడు రెండు సార్లు ట్రైచేశాను. లక్ బాగాలేక సెలెక్ట్ కాలేకపోయాను. కేవలం ఒక్క ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేక వెనకబడి పోయా! లేదంటే ఈ పాటికి కనీసం ఒక పాతిక లక్షలైనా కొట్టుకొచ్చే వాణ్ణి. అన్నాడు శీను.

శీను మంచి ఇంటెలిజెంటే! కాని పనిచేయాలంటే బద్దకం. స్టార్‌ప్లస్‌లో కౌన్‌బనేగా కరోడ్‌పతి ప్రారంభమైనప్పటి నుంచీ ఏదో ఒక రోజు తాను అకస్మాత్తుగా లక్షాధికారిని అయిపోయే అదృష్టం లభిస్తుందని కలలుగంటూ తిరుగుబోతుగా తయారయ్యాడు. కెబిసి మొదలుకొని మాటీవిలో ఇప్పుడు ప్రసారమవుతున్న అన్ని గేమ్‌షోలను రెగ్యులర్‌గా చూడడం ఒక పనిగా పెట్టుకున్నాడు. పాపం టీవిలో అడిగే అన్ని ప్రశ్నలకు అక్కడ హాట్ సీట్‌లో కూర్చున్న వారి కంటే ముందే ఠక్కున సరైన సమాధానం చెప్పెయ్యగలడు. కానీ అదృష్టం బాగాలేక వాడికి చాన్స్ వచ్చినప్పుడే ఏదో ఒక ప్రశ్న టఫ్‌గా వస్తోంది. దాంతో కనీసం ప్రోగ్రామ్ వరకు వెళ్లే అవకాశం కూడా రావట్లేదు.

నర్సరీ పిల్లల దగ్గర నుంచి రిటైర్మెంట్ దగ్గరపడ్డవారి వరకు కెబిసి కార్యక్రమం కాయకష్టం లేకుండా డబ్బుసంపాదించే మార్గం చూపి అందరినీ కలల లోకంలో విహరించేలా చేసింది. అటు పరిశ్రమలోనూ ఇటు ప్రజలలోనూ ఇంతగా దుమారం రేపిన గేమ్ షో మరొకటి ఇప్పటి వరకు రాలేదంటే అతిశయోక్తి కాదు. జీటీవి ప్రారంభం అయిన కొత్తలో మోహన్ కపూర్ నిర్వహించే "స్నేక్స్ అండ్ ల్యాడర్స్", "తోల్‌మోల్ కే బోల్" వంటి కార్యక్రమాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన ఉండేది. ఈ కార్యక్రమాలు వినోదాత్మకంగా ఉండేవి. ఇలాంటి కార్యక్రమాలను అడపాదడపా అన్ని చానళ్ళు ప్రసారం చేస్తుండేవి. కానీ కెబిసి తరహాలో కేవలం జనరల్ నాలెడ్జి ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి లక్షలు పట్టుకెళ్లే కార్యక్రమం మాత్రం ప్రసారం కాలేదు. అదృష్టం ఉంటే ఒక గంటలో కోటీశ్వరుడయ్యే అవకాశం కల్పించడంతో, ఈ కార్యక్రమాన్ని చూసే ప్రేక్షకుల సంఖ్య రామాయణం, మహాభారతం వంటి సీరియళ్ళే కాదు, ఇండియా-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లు నమోదు చేసిన రికార్డులను కూడా అధిగమించింది. ఒక సర్వే సంస్థ అంచనా ప్రకారం కెబిసి ప్రారంభం అయిన తర్వాత ఇతర చానళ్ళను చూసే ప్రేక్షకులలో 41శాతం మంది స్టార్‌ప్లస్ చానల్‌ను చూడడం ప్రారంభించారు. అంతే కాదు ఈ కార్యక్రమం ప్రసారం అయ్యే సమయంలో దేశంలోని 60శాతం మంది టీవి ప్రేక్షకులు స్టార్‌ప్లస్ చానల్‌కు అతుక్కుపోయారు. భారీ ప్రైజ్ మనీని ఆశగా చూపి ఒకే ఒక కార్యక్రమంతో తమ ప్రేక్షకులను తన వైపుకు తిప్పుకున్న స్టార్‌కు అడ్డుకట్ట వేయడానికి జీటీవి అనుపమ్‌ఖేర్‌తో 'సవాల్ దస్ కరోడ్ కా', సోనీ టీవి గోవిందా యాంకర్‌గా 'చప్పర్ ఫాడ్ కే' కార్యక్రమాలను సబ్‌టీవి 'జబ్‌ఖేలో సబ్‌ఖేలో' వంటి భారీ ప్రైజులను ఇచ్చే కార్యక్రమాలను ప్రారంభించాయి. అయితే ఈ కార్యక్రమాలు ఏవీ కూడా కెబిసి అంత విజయవంతం కాలేకపోయాయి. కెబిసికి యాంకర్‌గా వ్యవహ రించిన అమితాబ్ శైలిని, భాషను ఇతర చానళ్ల కార్యక్రమాల యాంకర్‌లు అందుకోలేక పోవడం ఒక కారణం కాగా. కెబిసి కార్యక్రమం నాణ్యత కూడా అద్భుతంగా ఉండడం మరో కారణం.

కెబిసిని 'హు వాంట్స్ టుబి మిలియనీర్' అనే బ్రిటిష్ గేమ్‌షో ఆధారంగా నిర్మించారు. దానిని ఆధారం చేసుకునే ప్రపంచం లోని పలు దేశాలలో విజయవంతమైన గేమ్‌షోలను



బోర్నవీటా క్విజ్ కాంటెస్ట్

పాఠశాల విద్యార్థుల తెలివితేటలను పరీక్షించి ప్రపంచానికి పరిచయం చేస్తున్న 'బోర్నవీటా క్విజ్ కాంటెస్ట్' భారత్‌లో చాలామందికి చిరపరిచితమే! ముందు రేడియోలో ప్రసారమై, తర్వాత బుల్లితెరపైకి అక్కడా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా పిల్లలందరూ ఆసక్తిగా పాల్గొనడానికి, చూడడానికి ఉత్సాహం చూపే కార్యక్రమం ఇది. దీనిలో ఎక్కడ డబ్బు ఆశలేదు. పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అర్హత సాధించడాన్ని, గెలవడాన్ని కూడా తమ తెలివితేటలకు ఒక కొలబద్దగా పరిగణిస్తారు.

మనీ బ్రైన్ ఆఫ్ ఆంధ్రా

MAA TV

మన తెలుగు చానల్ కూడా బిగ్-బిని అనుకరిస్తూ "కౌన్ బనేగా ఐదులక్షలకు 'పతి' కార్యక్రమం" ప్రసారమవుతోంది. మా టీవీలో సోమవారం నుండి గురువారం వరకు రాత్రిపూట "బ్రైన్ ఆఫ్ ఆంధ్రా" టెలీకాస్ట్ అవుతోంది. ఎయిర్‌టెల్ ఫోన్ ఎస్సెమ్మెస్ ద్వారా ఓ ఐదుప్రశ్నలకు బదులివ్వడంతో మొదలెట్టాలిట. కరెక్టు సమాధానం చెప్పినా వారి ప్రజ్ఞకో, జనరల్‌నాలెడ్జికో కాక వారి అదృష్టానికి విలువకడతారు. లక్కీ డ్రాలో లక్ ఉందని తేలిన ఐదుగుర్ని హైదరాబాదుకి రమ్మంటారు. వారిని 'బజర్ రౌండ్'లో వారి స్పీడీ జవాబుని బట్టి 'హాట్ చైర్' లో కూర్చోబెట్టుకుంటుంది ఆ ప్రోగ్రామ్ యాంకర్. 16ప్రశ్నలకు గాను మొదటి 4ప్రశ్నలకు పదివేలు, 8వ ప్రశ్న వరకూ ఇరవైఐదువేలు, 12వ ప్రశ్న వరకూ లక్ష, చివరి 16వ ప్రశ్న వరకూ సమాధానాలు కరెక్టుగా చెప్పినవారికి ఐదులక్షలు బహుమతి ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేస్తున్న 18 ఉత్పత్తుల అడ్వర్‌టైజ్‌మెంట్స్ ప్రసారం చేస్తున్నారు. ఈ యాడ్‌ల ద్వారా దాదాపు ఈ కార్యక్రమానికి తగ్గ ఆదాయం చూసుకున్నట్లే. ఎయిర్‌టెల్ ద్వారా దీనిలో పాల్గోవడం అనే బంధం ద్వారా వారి లావాదేవీలూ పెరిగాయి.

నిర్మించి ప్రసారంచేశారు. ఇప్పటికీ ఇలాంటి గేమ్ షోలు ఏదో ఒక రూపంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో, పలు భాషలలో ప్రసారమవుతూ టీవి ప్రేక్షకులకు వినోదం, విజ్ఞానంతోబాటు అదృష్ట వంతులకు విత్తాన్ని కూడా సంపాదించి పెడుతున్నాయి.

ఈ వారసత్వాన్ని మన తెలుగు చానళ్ళు కూడా పుణికిపుచ్చుకున్నాయి. కెబిసి ప్రసారం అవుతున్న రోజుల్లోనే ఒక తెలుగు చానల్‌లో ధర్మవరపు సుబ్రహ్మణ్యం యాంకర్‌గా "డింగుటకా..." అనే వినోదాత్మక గేమ్‌షో ప్రసారం అయ్యింది. అటు తర్వాత పలు చానళ్లలో టీవిలో యాంకర్ అడిగే ప్రశ్నలకు ఫోన్ ద్వారా సమాధానం చెప్పి ప్రైజ్ గెలుచుకునే కార్యక్రమాలను పండుగలకు పబ్బాలకు లేదా వారికి ఏ కార్యక్రమం దొరకనప్పుడు ప్రసారం చేయడం మామూలు విషయమే అయ్యింది. కానీ కెబిసి లాంటి కార్యక్రమాన్ని భారీ వ్యయంతో ప్రసారం చేయడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఆ లోటును ఇప్పుడు మా టీవీ తీరుస్తోంది. 'బ్రెయిన్ ఆఫ్ ఆంధ్రా' పేరిట మాటీవీ ప్రారంభించిన క్విజ్ షోకు కెబిసి అంత హంగూ ఆర్భాటాలు లేకపోయినా దాదాపు అదే పద్ధతిలో ఈ షోను నిర్వహిస్తోంది. అయితే ఈ షో కేవలం ఎయిర్‌టెల్ సెల్ కనెక్షన్ ఉన్న వారికే పరిమితం చేయడంతో ఒకవర్గం వారికోసమే ఈ కార్యక్రమమా అన్న భావన ఏర్పడి పోయింది. అందుకే కెబిసికి వచ్చినంత ఆదరణ ఈ కార్యక్రమానికి లభించినట్టు లేదు. అంతే కాదు ప్రైజ్ మనీ కూడా కేవలం ఐదు లక్షలు మాత్రమే నిర్ణయించడంతో ప్రేక్షకులు పెద్దగా ఆకర్షితులైనట్టు కనిపించడం లేదు. జనరల్ నాలెడ్జీక్కూడా మార్కెట్ వాల్యూ వచ్చేక నెలకొన్న ఫలితమిది.

గేమ్‌షోలతో ఎవరికి లాభం?

2000 జులై నుంచి 18నెలల పాటు ప్రసారమైన కెబిసి కోసం స్టార్‌టీవి 75 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. మరి వారికి వచ్చిన లాభం ఏంటనే ప్రశ్న మీలో తప్పక ఉదయించి ఉంటుంది. స్టార్‌కు మొత్తం 130 ఎపిసోడ్‌లు ప్రసారం చేసిన తర్వాత 195కోట్ల స్థూల ఆదాయం లభించింది. అంటే నికరంగా 125కోట్లు లాభం అన్నమాట. ఈ షో వల్ల ఇతరులు కూడా లాభపడ్డారు. ముఖ్యంగా బిగ్‌బి అమితాబ్ పీకల్లోతు



కష్టాలలో ఉన్నప్పుడు కెబిసి అతన్ని ఆపద్భంధువులా ఆదుకుంది. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన డబ్బుతో ఖాయిలాపడ్డ ఎబిసిఎల్ సంస్థను అమితాబ్ తిరిగి నిలబెట్టుకున్నాడని చెబుతుంటారు. ఈ షో ప్రసార కాలంలో స్టార్‌టీవి 20 కోట్ల రూపాయలు పబ్లిసిటీ మీద ఖర్చుపెట్టింది. అంటే పత్రికలలో ప్రకటనలకు వగైరాలకన్నమాట. దీంతో కొన్ని పత్రికలు, అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు కూడా ఎంతో కొంత వెనకేసుకున్నాయి. కెబిసికి పెరిగిన ప్రేక్షకాదరణను స్టార్‌టీవి బాగా సొమ్ముచేసుకున్నది. కార్యక్రమం మధ్యలో ప్రసారం చేసే యాడ్‌లకు ప్రతి 10 సెకండ్లకు 1.80 లక్షలు వసూలు చేసింది. అప్పట్లో జీ, సోని వంటి నంబర్ వన్ చానళ్ళు వసూలు చేసిన దానికన్నా ఈ రేటు నాలుగు రెట్లు అధికం. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఉత్సాహవంతుల మొదటి ఆధారం. దేశవ్యాప్తంగా నాలుగు మెట్రో నగరాలలో కెబిసిలో పాల్గొనే అర్హులను ఎంపిక

ఏప్రిల్ నుంచి మళ్ళీ కెబిసి

కౌన్ బనేగా కరోడ్‌పతి గేమ్ షోను వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి మళ్ళీ ప్రసారం చేయడానికి స్టార్‌టీవి సన్నాహాలు చేస్తున్నది. స్టార్ టీవి మొత్తం 390 ఎపిసోడ్‌ల కెబిసి కార్యక్రమాన్ని నిర్మించడానికి అమితాబ్ బచ్చన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. 2001 డిసెంబర్ 31 వరకు 305 ఎపిసోడ్లు ప్రసారం చేసింది. మిగిలిన 85 ఎపిసోడ్‌లను వచ్చే ఏప్రిల్ నుంచి వారానికి నాలుగు షోలతో ఆరునెలలపాటు ప్రసారం చేయనున్నారు. ఇంతకుముందు కన్నా ఎన్నో కొత్త ఆకర్షణలు ఇందులో చోటుచేసుకోనున్నాయి. షో జరిగే సమయంలో మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా ప్రేక్షకులు జవాబులు చెప్పడానికి అవకాశం కల్పించనున్నారు. ప్రేక్షకులు ఇంట్లో కూర్చునే 10 నుంచి 20 లక్షల వరకు గెలుచుకోవచ్చు.

ఆహా... ఏమి గిరాకీ!

చేసేందుకు 600వంద టెలిఫోన్ లైన్లను ఏర్పాటు చేశారు. దీంతో టెలిఫోన్ కాల్స్ ద్వారా ఎంటిఎన్ఎల్, బిఎస్ఎన్ఎల్, ఇతర ప్రైవేటు బేసిక్ టెలిఫోన్ ఆపరేటర్లు, సెల్‌ఫోన్ ఆపరేటర్లకు ప్రతిరోజూ కొన్ని లక్షల రూపాయల లాభం చేకూరింది. మాటీవిలో ప్రసారం అవుతున్న బ్రెయిన్ ఆఫ్ ఆంధ్రా ప్రోగ్రామ్ ద్వారా ఇతర టెలిఫోన్ నెట్‌వర్క్‌లు లాభం పొందకుండా కేవలం ఎయిర్ టెల్ వినియోగదారులకే రిజర్వ్ చేశారు.

మరి ఈ గేమ్ షోలను సక్సెస్ చేయడంలో ప్రధాన భూమిక నిర్వహించిన టీవి ప్రేక్షకులకు కలిగిన లాభం ఏంటి? వారి విజ్ఞానం ఎంతో పెరిగిపోయింది. కొందరు డబ్బుకోసం, మరికొందరు ఇంత చిన్న ప్రశ్నకు కూడా మనకు సమాధానం తెలియకపోతే నవ్వుకుంటారనే భావనతోనే తమ మేథకు వన్నెలు దిద్దుకునే బృహత్ కార్యక్రమాన్ని చాలా మంది ప్రారంభించారు. కొన్ని దిన పత్రికలు ఇలాంటి వారికోసం మొదటి పేజీలో కెబిసి పేరుతోనే ప్రతి రోజూ జనరల్ నాలెడ్జి ప్రశ్నలు సమాధానాలు కూడా చాలా రోజుల పాటు ప్రచురించాయి. ఒకవిధంగా ఇలా ప్రజలలో జ్ఞాన తృష్ణను రగిల్చినందుకు కెబిసికి కృతజ్ఞతలు చెప్పాల్సిందే! అయితే గేమ్‌షోలు నిజంగా జికెను పెంచడానికి తోడ్పడుతున్నాయా? సామాజిక శాస్త్రవేత్తలు మాత్రం కాదంటున్నారు. కొందరు ఈ షోలో పాల్గొనకపోయినా తమ జనరల్ నాలెడ్జిని పరీక్షించుకొని సంతృప్తి పడుతున్నారు. కానీ రాత్రికి రాత్రే కోటీశ్వరుడు అయిపోవాలన్న మధ్యతరగతి కలలకు కెబిసి, సవాల్ దస్ కరోడ్‌కా వంటి గేమ్‌షోలు మరింత ఆజ్యం పోస్తున్నాయని వారు అంటున్నారు. తమలాంటి ఒక మధ్యతరగతి వ్యక్తి ఒక గంటలో కోటీశ్వరుడు కాకపోయినా, లక్షాధికారి కావడాన్ని చూసి తమకూ ఏదో ఒక రోజు అలాంటి అదృష్టం రాకపోదా అని ఆలోచిస్తున్నారు.

క్లాసికల్ జూదం...

ఒక విధంగా ఈ కార్యక్రమాలు జూదాన్ని ప్రోత్సహిస్తున్నట్టే! ముఖ్యంగా ఇలాంటి కార్యక్రమాలు డబ్బుపై వ్యామోహాన్ని మరింత పెంచుతాయని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇతర క్విజ్ ప్రోగ్రాములు జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుంటే, కెబిసి వంటి మనీషోలు మనవునిలోని దురాశకు మరింత ఆజ్యం పోసి పెంచుతున్నాయనేది వారి ప్రధాన ఆరోపణ. "50 ఏళ్ళు



కష్టపడితే గానీ సంపాదించలేని డబ్బును 50 నిమిషాలలో సంపాదించవచ్చుని," కెబిసి యాంకర్ అమితాబ్ పలుమార్లు కార్యక్రమంలో నొక్కిచెప్పడమే ఇందుకు నిదర్శనం. కెబిసిలో కోటి రూపాయలు గెలుచుకున్న హర్షవర్ధన్ నవతే కూడా రెండు ప్రశ్నలకు ఊహాజనిత సమాధానాలు ఇచ్చి జాక్‌పాట్ కొట్టాడు.

ఈ కార్యక్రమాలలో ఉన్న సమస్య, టెన్షన్ అంతా కూడా వారు అడిగే ప్రశ్నల గురించి కాదు. ఆ ప్రశ్నలకు కరెక్ట్ సమాధానాలు చెబితే వచ్చే డబ్బు గురించే. కెబిసి వంటి కార్యక్రమాల వల్ల పిల్లలు, పెద్దల్లో కూడా జనరల్ నాలెడ్జి పెంచుకోవాలన్న తపన పెరిగింది. ఇది మంచి పరిణామమే! అయితే విజ్ఞానానికి డబ్బును జతచేసి ప్రజల మానసిక దుర్బలత్వాన్ని చానళ్ళు సొమ్ముచేసుకోవడాన్ని మాత్రం సైకాలజిస్టులు ఆక్షేపిస్తున్నారు. ఈ పరిణామాలు సమాజానికి మేలు చేసేవి కావని వారి భావన.

విజ్ఞానాన్ని సముపార్జించే స్థాయి నుంచి మనం జనరల్ నాలెడ్జిని నేర్చుకునే స్థాయికి దిగజారి పోయామని పంజాబ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సత్యపాల్ గౌతమ్ వ్యాఖ్యానించారు. ఈ కరోడ్‌పతి మేనియా అనేది మామూలు సమాచారాన్ని తెలుసుకోవడం అనే చిన్న విషయానికే మనల్ని పరిమితం చేస్తోంది. ఈ కార్యక్రమాలు కేవలం ఏవో కొన్ని ప్రశ్నలకు సమాధానాన్ని చెప్పడానికి అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవడాన్నే ప్రోత్సహిస్తున్నాయి. నిజంగా ఈ కార్యక్రమాలు ప్రజలకు వారికి అవసరమైన రంగంలో జ్ఞానాన్ని సముపార్జించుకునేలా చేయగలిగితే సమాజానికి ఎంతో మేలు చేసిన వారవుతారని గౌతమ్ వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమాలను నిర్మించే నిర్మాతలు కేవలం వాటి ద్వారా ఎంత డబ్బు సమకూరుతుందనే విషయాన్ని మాత్రమే చూస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థలు కలిగిన పాశ్చాత్య దేశాలలో ఇలాంటి కార్యక్రమాలను కేవలం చానల్స్‌కు డబ్బు సంపాదించిపెట్టడానికే ప్రసారం చేస్తారు. కెబిసి కార్యక్రమం ద్వారా స్టార్ టీవీ దాదాపు 100కోట్ల రూపాయల లాభం మూటకట్టుకున్నది. కానీ భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో టెలివిజన్ కార్యక్రమాలకు కొంత సామాజిక బాధ్యత కూడా ఉంటుంది.

కేబుల్ టెలివిజన్ దేశంలోని ప్రతి మూలకూ అందుబాటులోకి రావడంతో గ్రామాలు, పట్టణాలలో కూడా కన్స్యూమర్ కల్చర్ బాగా పెరిగిపోతోంది. ఈ సంస్కృతికి కెబిసి వంటి కార్యక్రమాలు మరింత దన్నునిస్తాయి అని సామాజిక శాస్త్రవేత్త ఒకరు వ్యాఖ్యానించారు. ఈ మధ్య కాలంలో మధ్య తరగతి ఇళ్ళలో త్వరగా ధనవంతుడు కావడం ఎలా? అనే ప్రశ్న సర్వసాధారణంగా వినిపిస్తున్నది. సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు మూలం కెబిసి లాంటి కార్యక్రమాలే. పేద, మధ్యతరగతి ప్రజలు టీవిలలో ఇలాంటి కార్యక్రమాలు చూసి ఒక గంటలో లక్షాధికారి అయ్యే అవకాశం రావడం చూసి వారిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతున్నది. తాము ఎంతకాలం కష్టపడినా లక్షాధికారి కాలేమనే నిరుత్సాహమే ఇందుకు కారణం. ఇలాంటి వారే ఒకొక్కసారి ఆత్మహత్యలకు కూడా పాల్పడతారు. లేదా డబ్బు సంపాదించడానికి అడ్డదారులు తొక్కుతారు. దాంతో సమాజంలో నేరాల రేటు పెరిగిపోతుంది. ఇప్పటికే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతున్నట్టు కొన్ని అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. పూరి గుడిసెల్లోకి కూడా చొచ్చుకుపోయిన టీవి ఇప్పుడు ప్రజల నైతిక విలువలను దిగజార్చడంలో, వారిని అవినీతి, నేరమయ జీవితం వైపు నడిపించడంలో కూడా కృషి చేస్తున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు.

బిబిసి రియల్ 'మాస్టర్‌మైండ్'

డబ్బుతో సంబంధ లేకుండా విజ్ఞానం, వినోదం పంచుతూ 'మాస్టర్ మైండ్స్ ఇండియా' క్విజ్ షో కార్యక్రమాన్ని బిబిసి వరల్డ్ చానెల్ 1998 నుంచి ప్రారంభించింది. కుతుబ్ మినార్, కలకత్తా టౌన్ హాల్, మైసూర్ లలితా మహల్ ప్యాలెస్, జైపూర్ సిటీ ప్యాలెస్ వంటి చారిత్రక ప్రదేశాలలో ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించారు. ప్రతి సంవత్సరం కొత్తగా ప్రిలిమినరీ రౌండ్‌ను ప్రారంభించి సంవత్సరాంతంలో 'మాస్టర్ మైండ్' విజేతను ప్రకటిస్తారు. ఇప్పటి వరకు దాదాపు 400 సబ్జెక్టులపై ఈ కార్యక్రమాన్ని నిర్మించగా 8వేల మంది ఇందులో పాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి సింగపూర్‌కు చెందిన ఆసియన్ టీవి అవార్డ్స్ అకాడమీ నుంచి 'బెస్ట్ క్విజ్ షో' అవార్డు కూడా లభించింది. ఈ కార్యక్రమాన్ని కూడా కెబిసికి ప్రశ్నలను తయారు చేస్తున్న సిద్ధార్థ బసునే నిర్వహించారు.

యూనివర్సిటీ చాలెంజ్

కళాశాల విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టిన కార్యక్రమాలలో 'యూనివర్సిటీ చాలెంజ్' కూడా బిబిసి వరల్డ్ నిర్మించి ప్రసారం చేస్తున్నది. భారత్‌లోని కళాశాలలకు చెందిన తెలివైన టీములను ఎంపిక చేసి వారి మధ్య పోటీపెట్టి బెస్ట్ టీమ్‌ను సెలెక్ట్ చేస్తారు. ఒక్కొక్క టీమ్‌లో నలుగురుండే రెండుటీములు పోటీ పడతాయి. ఈ కార్యక్రమాన్ని కూడా సిద్ధార్థ బసునే నిర్మిస్తున్నారు.

ఇలాంటి మనీ షోల వల్ల స్థానికంగా జూదం, పందేలు, బెట్టింగ్‌ల్లాంటివి పెరిగిపోతాయని సామాజిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హర్యానాలోని గ్రామాలలో మహిళలు పనులకు వెళితే పురుషులు పేకాటలో మునిగి తేలుతున్నారని వారు సాక్ష్యం కూడా చూపెడుతున్నారు. ఈ మనీ షోలు రామాయణం, మహాభారత్ లాగా ఊరు ఊరంతా కలసి చూస్తున్నారు. ఇలా వీక్షించిన వారి మానసిక స్థితి క్రమంగా మారిపోతుంది. ముఖ్యంగా పసి మనసులపై ఈ కార్యక్రమాలు చూపే ప్రభావం ఎంతో ఉంటుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమాలు గ్లామర్, ఈజీ మనీని ప్రమోట్ చేస్తున్నాయని వారి భావన. ప్రతి ప్రశ్న ఒక ఆకర్షణీయమైన బహుమతితో ఉన్నందున ఇవి ముందుగా డబ్బు కార్యక్రమాలే. ఆ తర్వాతే క్విజ్ ప్రోగ్రాములు. ఈ కార్యక్రమాలు ప్రైమ్ టైమ్‌లో ప్రసారం అవడం వల్ల విలువైన కుటుంబ సమయం టీవి వీక్షణంలోనే గడిపేస్తున్నారు. కుటుంబంలోని మానవ సంబంధాలు పూర్తిగా దిగజారి పోతున్నాయి. వినోదం అనేది ఒక వ్యక్తి శ్రమను మరచిపోయి హాయిగా గడపడానికి తోడ్పడాలి. కానీ ప్రస్తుతం మన చానళ్ళు ప్రసారం చేస్తున్న మనీ షోల వల్ల అయ్యో నాకున్నది ఇంతేనా అనే భావన కలుగుతున్నది. దాంతో అందని మావిపండు కోసం 'ఫోనుకొట్టు-ప్రైజుకొట్టు' అనే తరహాలో పోతే రూపాయి వస్తే లక్ష అని అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు జూదానికి సిద్ధమవు తున్నాం. ఇలాంటి గేమ్ షోలను మనం ప్రోత్సహిస్తే, అవి భవిష్యత్తులో మానవ సంబంధాలు, నైతిక విలువలపై విపరీత ప్రభావాన్ని చూపుతా యనడంలో సందేహం లేదు. టీవి ప్రేక్షకులారా తస్మాత్ జాగ్రత్త. ❖



కౌన్ బనేగా కరోడ్‌పతి కి స్టార్ టీవి ఖర్చు

అదృష్టవంతుడైన విజ్ఞానవంతుల్లో ఒకరిని కోటీశ్వరుడిని చేయడానికి స్టార్ టీవి చానెల్ సుమారు 75కోట్లు ఖర్చు అంచనా వేసుకుంది. కానీ వాస్తవంలో అయిన ఖర్చు....

అడ్వర్‌టైజ్‌మెంట్లు, పబ్లిసిటీలకు 20కోట్లు, బిగ్ బి అమితాబ్ బచ్చన్ కు 7కోట్లు, ప్రొడక్షన్ ఖర్చులు 15కోట్లు మాత్రమే అయ్యాయి. 130 ఎపిసోడ్లు ప్రసారం అయ్యేనాటికే 195కోట్ల రూపాయల ఆదాయం వచ్చినట్లు ఒక వెబ్‌సైట్ సమీక్షకుడి సమాచారం.

ప్రకటించిన ఒక వారం రోజులకే 30లక్షలమంది వీక్షకులు నమోదయ్యారు. మొదటి క్విజ్ కార్యక్రమంలో ముంబయికి చెందిన ఒక స్కూల్ టీచర్ ఎనభైవేలు గెలుచుకున్నారు. కోటి రూపాయలు గెలుచుకున్న ఒకేఒక్క విజేత హర్షవర్ధన్ నవాతే కూడా ముంబయివాలానే. రకరకాల టాక్సులు, కటింగ్‌లంటూ ఓ అరవై లక్షలు... చేతులో పెట్టారట. నాలుగు మెట్రో నగరాలలో 600 టెలీలైన్స్ ఈ కార్యక్రమానికి కాల్సు తీసుకోవడానికి శ్రమించాయి. స్టార్ టీవి వారు ఈ కార్యక్రమ సమయంలో ప్రసారంచేసే వ్యాపారప్రకటన ఒక్కంటికి 10సెకన్లకు గాను 1.80లక్షలు రేటు వసూలుచేశారు.

వి.నాగరత్న



"వసూ, మై లవ్!" ఆ స్వరం, ఆ పలకరింపు, ఆ ఆప్యాయతా వినగానే ఉక్రోషంతో గుండెలోతుల్లోంచి ఏడ్పొచ్చేస్తోంది వసుమతికి. వెంటనే ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది. అర నిమిషంలో ఫోన్ మళ్ళీ మోగింది. తనని తాను నిగ్రహించుకుంటూ ఫోనెత్తింది వసుమతి.

"సారీరా, మధ్యలో కట్టయింది" అన్నాడు శేఖర్. వసుమతికి ఒక్కమాట కూడా మాట్లాడాలన్పించలేదు.

మౌనంగా రిసీవర్ క్రెడిల్ చేసి, అంతలోనే వాల్యూం లోసౌండ్‌కి మార్చింది. అదెంత మొత్తుకున్నా విన్పించకుండా. రిసీవర్ పక్కన పడేస్తే ఇతర్ల దృష్టిలోకి వస్తుంది. అది టాకాఫ్ ది డే అవుతుంది.

బాయ్ తెచ్చిన టీ తాగుతూ మెకానికల్‌గా పని చేసుకోసాగింది. ఒక పావుగంట తర్వాత వాల్యూం నార్మల్లో పెట్టి ఈసారి ఫోన్ మోగితే బాయ్‌తో లిఫ్ట్ చేయించి తాను రాలేదని చెప్పించాలనుకుంది.

కానీ సెక్షన్ బాయ్ యాదగిరి ఆవలించకుండానే పేగులు లెక్కబెట్టగల దిట్ట. అలాంటి వాడికి శేఖర్ గొంతు తెలీదా? శేఖర్‌కి తాను వుండే లేనని చెప్పించగానే అద్భుతమైన కథలల్లేసి ఆఫీసంతా టాంటాం చేసేస్తాడు. ఎవరూ వచ్చి ఎదురుగా ఏమీ అనకపోయినా వక్రచూపులు, వంకర మాటలూ సాగిస్తారు. వాటిని భరించడం మహాకష్టం.

"ఛ... అసలీ వెధవ ఫోన్ కనిపెట్టిన వాణ్ణి... గ్రాహంబెల్‌ని ఏమన్నా పాపం లేదు" కసిగా పళ్ళు కొరుక్కుంది.

ఆలోచన్లతో సతమతమైపోతున్న వసుమతి పనిమీద కాన్‌సన్‌ట్రేట్ చేయలేకపోయింది. అరగంటలోనే తీవ్ర తల్నొప్పంటూ లీవ్‌లెటర్ రాసిచ్చి ఆఫీసు నుండి బయటపడింది.

ఆమె ఒక మలయాళీ కుటుంబంలో పేయింగ్ గెస్ట్‌గా వుంటోంది. వాళ్ళు ఎప్పట్నుండో ఏ.పి.లో వుండటం వల్ల తెలుగు ఎంతో ఫ్లూయెంట్‌గా మాట్లాడ్తారు.

"అరే, వసూ! అప్పుడే వచ్చేశావే? ఒక ఐదు నిమిషాల క్రితం శేఖర్ నీకోసం ఫోన్ చేశాడు" అంది మహేశ్వరి తడి తలలోకి చేతులు జొనుపుకుంటూ.

"వూరికే వచ్చేశాను చేచీ. శేఖర్ మళ్ళీ చేస్తే నేను వచ్చి వూరెళ్ళానని చెప్పండి. ఓ కప్పు స్ట్రాంగ్ టీ ఇవ్వగలరా చేచీ" అంటూ తన గది తాళం తీసింది వసుమతి.

'డికాషన్ వుంది, వన్‌మినిట్‌లో తెస్తాను" అంటూ తన స్థూలకాయాన్ని వంటింటివైపు కదిలించింది మహేశ్వరి.

గదిలోకి రాగానే అందంగా నవ్వుతూ దర్శనమిచ్చింది శేఖర్ ఫొటో. ఆ ఫొటోని ఎంతో మక్కువతో ఎన్‌లార్జ్ చేయించి గదిలో ఏ మూల నుండి ఏ యాంగిల్లోంచి చూసినా కన్పించేట్లు పెట్టింది. దాన్ని చూడగానే కళ్ళు వర్షించాయి. ఫొటోని విసిరి కొట్టాలనిపించింది. తమాయించుకుని డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు తెరచి, అందులో పడేసింది. గది లోపలే ఎటాచ్డ్ బాత్ వుంది. కాళ్ళూ ముఖం కడుక్కుని బట్టలు మార్చుకునేసరికి చేచీ టీ తెచ్చిచ్చి తనూ తాగుతూ కూర్చుంది.

"ఏం వసూ, డిస్టర్బ్‌డ్‌గా వున్నావు?"

"తల్నొప్పిగా వుంది"

"అది ఎక్స్‌టర్నలనుకో... శేఖర్ ఫొటో ఎందుకు తీసేశావు దొంగా?" చనువుగా అంది చేచీ.

వసూ కళ్ళు సజలాలయ్యాయి.

"సారీ వసూ! నీ పర్సనల్ విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాననుకోకు. నిన్నెపుడూ కేవలం పేయింగ్ గెస్ట్ అనుకోలేదు. మా ఫామ్లీలో ఒక మెంబర్‌లా ఫీలవుతాను.

"నేను అంతేగా చేచీ, నా సొంత అక్కలాగే అన్పిస్తారు మీరు. లేకుంటే ఇంత చనువుగా వుండేదాన్నా?"

"అదే నిజమైతే చెప్పు మరి, ఎందుకలా వున్నావు ?"

"మీకెలా చెప్పాలో తెలీదు. కానీ ఒకటి మాత్రం నిజం. మగవాళ్ళు ప్రేమ, దోమ అంటూ రంగంలోకి దించేవరకూ ఒకరకంగా వుంటారు. తీరా తలలోతు దింపి ఇక తమ బాధ్యతైపోయినట్లు ప్రవర్తిస్తారు. చేచీ... నిజంగా నా మైండస్సలు బాగాలేదు. సాయంత్రం మీతో మాట్లాడ్తాను."

"ఓసి పిల్లా, అంటే ఇప్పుడు దయ చేయి అనేకదా నీ భావం. వెళ్తానుగానీ పిచ్చి ఆలోచన్లు పెట్టుకోక రిలాక్సవు, హాయిగా నిద్రపో" అంటూ మహేశ్వరి గదిలోంచి వెళ్ళింది.

వసుమతి నిద్రపోదామని ప్రయత్నించింది. కానీ ససేమిరా నిద్ర రాలేదు. వచ్చేపుడు దారిలో తెచ్చిన ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ని టీపాయ్ మీద పెట్టి, అందులో కర్నూలు ప్రాంతాన్ని కసిగా కోసేసింది. ఆ ముక్కని డస్ట్‌బిన్‌లోకి విసిరేసింది. 'కర్నూల్ లేని ఏ.పి. ఎంత బావుందో' అనుకుంది. అంతలోనే ఆమె బుద్ధి ఆమెని హెచ్చరించింది. తాను విచక్షణ కోల్పోడం లేదు కదా?!

అంతా శేఖర్ వల్లే. తనని మనిషనుకున్నాడా, మట్టి బొమ్మనుకున్నాడా?

ప్రేమించానంటూ చచ్చు కబుర్లు చెప్పి, మత్తుమందు చల్లి మైకంలో ముంచేశాడు. రోజూ వచ్చేవాడు. గంటకోసారి ఫోన్ చేసేవాడు. అలా కంపోజ్ చేసి అతని ఫోన్‌కాల్స్ కోసం, రాకకోసం ఎదురు చూసేట్లు, పడిగాపులు పడేట్లు చేసి వదిలిపెట్టాడు. ఇక ఇప్పుడు ప్రెసిడెంటో, ప్రైమ్‌మినిస్టరో అన్నట్లు ఫోజు పెడ్తాడు. తోచినపుడు వస్తే వస్తాడు. లేదంటే ఫలానా రోజు రావడానికి ప్రయత్నిస్తానంటాడు.

తరచు వాళ్ళ ఊరెళ్ళి వస్తుంటాడు. అకారణంగా సెలవు పెట్టి వెళ్ళాల్సినంత అవసరమేముంది అని ఒకసారి నిలదీస్తే గుర్రం సకిలించినట్లు ఇకిలిస్తూ తనకి పెళ్ళిచూపులని చెప్పాడు. గుడ్లురిమి చూసేసరికి "మా వాళ్ళ కోసం నేవెళ్ళక తప్పదు. పిల్లెంత బాగున్నా నేనెటూ నచ్చలేదనే చెప్తాను" అన్నాడు. "అలాంటప్పుడు అసలు ఆ హంగామా ఎందుకు? అవతలి పిల్ల మాత్రం నొచ్చుకోదా? అక్కడికేదో ఆమె డిస్‌క్వాలిఫై ఐనట్లు" అంటూ కోపగించుకుంది. ఊళ్ళోవాళ్ళ సంగతి కూడా నీకే కావాలా? నేను ముందే మొరాయిస్తే మా వాళ్ళకి అనుమానం వచ్చి నిఘా పెట్టారనుకో మన ప్రేమకే బ్రేక్ పడ్తుంది. అంటూ లెక్చరిచ్చాడు. ఆమె ఎంత వాదించినా అతడి వితండవాదం ముందు నెగ్గలేకపోయింది.

ఊరెళ్ళడానికి వారం ముందునుంచే తను వెళ్ళబోయే తేదీ, టైమూ చెప్తూ, థౌజండ్ వాట్స్‌బల్బ్‌లా ముఖాన్ని వెలిగించుకుంటూ "మా ఊరెళ్తున్నా వసూ" అంటాడు. ఆమెకు చిర్రెత్తుతుంది. పసిపిల్లకో వెయ్యి బెలూన్లు ఒకేసారి కొనిస్తే కూడా అంత సంబరపడదేమో, స్త్రీకయినా, పురుషుడికయినా ఎఫెక్షనూ, ఎటాచ్‌మెంటూ అన్నీ వుండాల్సిందే. కానీ కాస్తంత నిబ్బరం, గాంభీర్యం లేకుంటే అదంతా అసహజంగా తోస్తుంది.

ఊళ్ళో వున్నప్పుడు ఉత్త పుణ్యానికి ఫోన్ చేసే వాడు ఊరెళ్తే తన ఉనికినే మర్చిపోతాడు. వసూ అనే ఒక జీవి వుందో, పూడిందో కూడా అతనికి పట్టదు. ప్రతి నిమిషం ఊపిరి బిగపట్టి అతని ఫోన్‌కోసం, రాకకోసం ఎదురు చూస్తుంది. తీవ్ర నిరాశతో కొట్టుకుపోతుంది. పెళ్ళిచూపులనేవి తల్లిదండ్రుల కంటితుడుపు కోసమే అని చెప్పాడు గానీ తీరా వెళ్ళాక తండ్రి కుటుంబంలోంచి వెలేస్తాననో, తల్లి బావిలో దూకి ఛస్తాననో బెదిరించేసరికి లొంగిపోయి పిల్ల మెళ్ళ తాళికట్టాడో ఏమో! ఇక తామిద్దరూ జీవితంలో మళ్ళీ కలుసుకోరేమో, మాట్లాడుకోరేమో అన్నంత దుర్భర దైన్యంలో కెళ్తుంది. అనుక్షణం అతన్ని తల్చుకుంటూ, అవసరం లేకపోయినా, అసందర్భం అని తెలిసినా అతని గురించి తోటివారికి ఏమో చెప్తుంటుంది.

ఊళ్ళోకి వస్తూనే రైల్లో, బస్సో దిగగానే తనకి ఫోన్ చేసి, క్షేమ సమాచారాలడుగుతాడు. ఇక అప్పటివరకూ అణిచిపెట్టుకున్న ఆవేశం లావాలా ఉప్పొంగుతుంది. చిరాగ్గా, నిరాసక్తంగా మాట్లాడ్తుంది. ఆ అసహనాన్ని కూడా అతడు భరించలేడు.

"నేనెంత ప్రేమగా చేశానో నువ్వంత కేర్‌లెస్‌గా మాట్లాడుతున్నావు. రాళ్ళు నయమోయ్, పాటలకో వేటికో కరుగుతాయట, నువ్వు..." అంటూ నిష్ఠూరమాడ్తాడు.

"తెల్సుకున్నావుగా గొప్ప సంగతి చాలా ఆలస్యంగా. నేను రాయికంటే కఠినం. ఇనపముక్కని, సరేనా" కరుకుగా మాట్లాడ్తోంది.

"వెల్‌సెడ్" అంటూ నవ్వుతాడతను.

"స్టుపిడ్! నువ్వీ జన్మకి నన్నర్థం చేసుకోలేవు" అంటుంటే ఆమె కంఠం జీరపోతుంది.

అప్పటికీ శేఖర్‌కి ఆమె అంతరంగం అర్థం కాదు. ఏదోలే, అకారణంగా విసుక్కుంటోంది. ఈ పిల్లకి కోపం జాస్తి. తను కాబట్టి సరిపోయింది. మరో మగాడయితే ఈడ్చిపెట్టి తన్నేవాడేమో. తనెంత మంచిగా వున్నా అలకలూ, అసహనాలు చూపుతుంది అనుకుంటాడు.

తనవైపు నుంచీ, అతనివైపు నుంచీ కూడా తనే ఆలోచిస్తూ తప్పెక్కడ అని ఎనలైజ్ చేయడానికి ప్రయత్నిస్తోంది వసుమతి.

అలా బోల్డంతసేపు మథన పడ్డాక తన భావాలని నెచ్చెలి డైరీతో పంచుకోవడం మినహా మరేం చేయలేక రాయడం మొదలెట్టింది.

"సినారె! ఎంత గొప్ప కవివైనా నువ్వూ మగవాడివే గనుక అంత తేలిగ్గా అలా రాయగలిగావు. 'రానంతవరకూ విరహమా, నేను రాగానే కలహమా' - అట. మరి రాకముందు ఎక్కడున్నాడో ఎలా వున్నాడో, ఎందువల్ల రాలేకపోయాడో, వస్తే బాగుండు, అతని సన్నిధిలో సర్వం మర్చిపోవచ్చు అన్న లక్ష ఆలోచన్లు, ఆశలు ... కానీ తీరా నిక్షేపంగా వుండే నిర్లక్ష్యం వల్ల రాలేదని అర్థమయ్యేసరికి తగని కోపం రాదా మరి.

స్త్రీ అంటే వస్తువా? ఆమెకి మాత్రం స్పందనలూ చింతకాయలూ వుండవా? వచ్చినపుడు సహకరించి రానపుడు నిశ్చింతగా వుండాలంటే ఎలా సాధ్యం?

శేఖర్ బహుశా అనుకుంటాడు తాను మామూలు మగవాడిలా దురహంకారంగా, దురుసుగా వుండకపోయినా అదేం గమనించకుండా పెలుసుగా వ్యవహరిస్తానని. కానీ అతనికెలా అర్థమవుతుంది, తనని పిచ్చిగా ప్రేమిస్తున్నాననీ, రవంత నిర్లక్ష్యాన్ని కూడా భరించలేననీ, ఆ ప్రేమ వల్లే కోపం వస్తుందనీ...

నేను మా ఊరెళ్తే మాత్రం శేఖర్ని ఒక్క క్షణం మర్చిపోయానా? ఇంట్లో ఫోనులేదు గనుక చెల్లెల్ని తోడు తీసుకెళ్ళి మరీ అతనికి అక్కణ్ణుంచి ఫోన్ చేసి మాట్లాడలేదూ?! తనవాళ్ళని కలిసిన ఆనందంలో శేఖర్ని మర్చిపోతే అసలది ప్రేమేనా? ఇలా నిలదీస్తే "మీ వాళ్ళు ఒప్పుకున్నారు కనుక నువ్వు నాకు ఫోన్ చేయగలిగావు. మరి మా వాళ్ళు నిన్ను చేసుకోడానికి ఒప్పుకోలేదు, నేనెలా చేయగలను?" అంటాడు.

ఎంత సెన్స్ లేని మనిషి ?

మనసుంటే మార్గాలుంటాయి. అతనికి ఫోన్ చేయాలని వుంటే బయటికొచ్చి చేయలేడా? జైల్లో ఖైదీలు కూడా పోలీసుల కళ్ళు గప్పిమరీ రాచకార్యాలు వెలగబెడ్తారే, ఇదంతకంటే కష్టమా?

సరే అతనితో మాట్లాడాలన్పించడం, అతని కుశలాలు తెలుసుకోవడం... కొద్దిరోజులు ఈపాటి విరహాన్ని, వియోగాన్ని భరించలేనంత అశక్తురాల్నేం

"సినారె! ఎంత గొప్ప కవివైనా నువ్వూ మగవాడివే గనుక అంత తేలిగ్గా అలా రాయగలిగావు. 'రానంతవరకూ విరహమా, నేను రాగానే కలహమా' - అట. మరి రాకముందు ఎక్కడున్నాడో ఎలా వున్నాడో, ఎందువల్ల రాలేకపోయాడో, వస్తే బాగుండు, అతని సన్నిధిలో సర్వం మర్చిపోవచ్చు అన్న లక్ష ఆలోచన్లు, ఆశలు ... కానీ తీరా నిక్షేపంగా వుండే నిర్లక్ష్యం వల్ల రాలేదని అర్థమయ్యేసరికి తగని కోపం రాదా మరి. స్త్రీ అంటే వస్తువా? ఆమెకి మాత్రం స్పందనలూ చింతకాయలూ వుండవా? వచ్చినపుడు సహకరించి రానపుడు నిశ్చింతగా వుండాలంటే ఎలా సాధ్యం?"

కాదు. సవ్యమైన కారణం వుంటే విరహం కూడా మధురంగానే వుంటుంది. కానీ అసలు బాధ అదికాదు. ఈ మనిషికి ఇంత పిరికితనం ఏమిటి అని! అమ్మానాన్నల సన్నిధిలో తనసలు గుర్తురాలేదంటే ఇదేదో కాలక్షేపపు వ్యవహారంలా అన్పించి గుండె కోసేసినట్లుంటుంది. జీవితంలో దేని అవసరం దానికున్నట్లే ఎవరి ప్రాముఖ్యత వాళ్ళకుంటుంది. తల్లా, పెళ్ళామా అనే ప్రశ్న అర్థరహితం. ఒకరికి ఒకరు పోటీ కాదు, ఒకరిస్థానాన్ని ఇంకొకరు భర్తీ చేయరు.

సైన్స్ ఇంత డెవలప్ చెంది, స్పేస్‌లోకి పరిగెడుతున్న ఈ కాలంలో కూడా ఇంకా కులాల రాద్ధాంతాలేమిటో? తను తక్కువ కులంగా పరిగణింపబడుతున్న కులంలో పుట్టడం తన తప్పా? ఈ కులాన్ని సృష్టించిందీ, పెంచి పోషిస్తోందీ కూడా మనుషులే గదా! అదే శేఖర్లా తాను అగ్రకులంలో పుట్టుంటే ఎంత బాగుండేది? అడ్డొచ్చిన వాళ్ళనీ, వంక పెట్టిన వాళ్ళని దులిపేసేది. అతన్ని నిర్భయంగా తనవాణ్ణి చేసుకునేది. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా వుంది. తానేం తక్కువది కాదు అని తన గురించి తాను చెప్పుకోవడం ఇష్టం లేదు. అది శేఖర్ చేయాల్సిన పని. తానేదో ప్రలోభపెట్టి అతన్ని చేసుకోవడం అనేది నా వ్యక్తిత్వానికే భంగం.

నేనేం చేయాలో నాకే తెలీకుండా వుంది.

ఈ సంఘర్షణకి ముగింపు ఎప్పుడో?!" అంటూ రాసి డైరీ మూసేసింది వసుమతి. ❖

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

దారిద్ర్యం తీరేదెట్లా?

చాలా రోజుల తర్వాత మామయ్య ఊరి నుంచి వచ్చాడు. "ఏం మామయ్యా! అంతా బాగేనా?" పలకరించాను క్షేమ సమాచారం కనుక్కుందామని.

"ఏం బాగమ్మా! మా పల్లెటూరికి వస్తే ఒక్కరోజు వుండలేవు నువ్వు. పారిపోయి వచ్చేస్తావ్" అన్నాడు మామయ్య.

"ఎందుకని? మామయ్యా!" ఆందోళనగా అడిగాన్నేను.

"ఎందుకేంటమ్మా! ఏముందని అక్కడ. ఏవో ఒకటి రెండు జల్లులు పడి మురిపించాయి. అది చూసి రైతులు బోలెడు డబ్బుపెట్టి విత్తనాలు, ఎరువులు కొన్నారు. విత్తనాలు వేశారు. అవి మొలకెత్తాయో లేవో వానల్లేకుండాపోయాయి. మళ్ళా ఎండాకాలం వచ్చిందా అన్నట్లుగా ఎండలు మండిపోయాయి. మొలకెత్తిన విత్తనాలు మాడి మసిబొగ్గయిపోయాయి. అది మొదలు మళ్ళా రైతులు ఆకాశం వైపు చూపులు నిలిపారు. నైరాశ్యం వాళ్ళనావరించింది. మబ్బులు కురవంది వాళ్ళేం చేసే పరిస్థితుల్లో లేరు. చివరకు ఇదిగో ఇప్పుడు మళ్ళా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు మళ్ళా విత్తనాలు ఎరువులంటూ విత్తనాలమ్మే దుకాణాలకెగబడ్డారు. అవి బోలెడు ధరలు పిరంగా వున్న విత్తనాలు కొంటే ఏ విత్తనాలు మంచివో ఏ విత్తనాలు మంచివి కావో తెలియదు. గ్యారంటీ అన్నది లేదు. విత్తనాలు కొనుక్కొచ్చి చల్లితే నగమే మొలుస్తున్నాయి. సగం మొలవటమే లేదు. ఇదంతా రైతుల పెట్టుబడులను పెంచి నడ్డి విరిచేస్తున్నదనుకో అమ్మాయి!" అన్నాడు మామయ్య. చివరకు నిట్టూర్పు కూడా విడిచాడు.

"ఏమిటో మామయ్యా! ఈ విత్తనాల జోలి నాకర్థం కావటం లేదు. మా చిన్నప్పుడు మా తాతమ్మ మంచి మంచి కంకులనేరి, వచ్చే ఏటికని విత్తనాల కోసమని వేరే భద్రంగా పెట్టేది. అదే విధంగా వడ్లు కూడా మంచి రకాన్ని ఎంచుకొని విత్తనాల వడ్లు అని వేరే బస్తాల్లో పోసి వుంచేది. ఇక కాలం రాంగానే ఆ వడ్లను చల్లించేది. అవి మొలకెత్తితే వాటిని నారు అని పొలాల్లో నాటు పెట్టేవారు. నారు గనుక మిగిలితే పొరుగువాళ్ళకు పంచిపెట్టేవాళ్ళు కూడా. అంతా సాఫ్‌గా ఒకరి మీద ఆధారపడకుండా బజార్లకు దుకాణాలకు పరిగెత్తకుండా దమ్మిడీ ఖర్చు లేకుండా జరిగిపోయేది. ఇప్పుడు పరిస్థితి అంతా మారిందెందుకు మామయ్యా! ఆ పాత పద్ధతే బాగుండేది కద!" అన్నాన్నేను.

"అయ్యో తల్లీ! నువ్వు మాట్లాడేది పాతకాలపు ముచ్చట్లు. ఇప్పుడు అట్లా విత్తనాలు తీసివేస్తే అస్సలు మొలవవు. ఇప్పుడంతా హైబ్రిడ్ విత్తనాలు వచ్చాయి. అవి మేలురకం. బాగా పంటనిస్తాయి. ఎకరానికి పంట దిగుబడి అధికంగా రావాలంటే హైబ్రిడ్ విత్తనాలు వాటితో ఎరువులు వాడవలసిందే. ఎట్లా అయితే భూమ్మీది నుంచి నాటుకోళ్ళు పోయి హైబ్రిడ్ కోళ్ళే మిగిలాయో అట్లా అసలు విత్తనాలు పోయి ఈ హైబ్రిడ్ విత్తనాలే మిగిలాయి అమ్మాయి! అర్థమైందా!" చిరునవ్వు నవ్వాడు మామయ్య.

"అయితే మామయ్యా! హైబ్రిడ్ విత్తనాలు అంటున్నావు కద. వాటిని సరఫరా చేసేవాళ్ళు మరి మంచి విత్తనాలు సరఫరా చేస్తున్నారనే గ్యారంటీ ఏదైనా వుండాలె



కద! లేకపోతే రైతులు వానలు వచ్చాయని విత్తనాలు కొని వేయటం అవి బాగా మొలవలేదని మళ్ళా కొని వేయటం ఇదంతా రైతుకు పెట్టుబడులను పెంచుతున్నాయి కద! అందులో ఆ విత్తనాలు ఏం చవకగా లేవట. విత్తనాలు చల్లినప్పుడు వాటితో ఎరువులు వెంటనే వేయాలట. లేకపోతే మొలకెత్తవు. మొలకెత్తినా బలంగా వుండవట. ఇంత చేసి వానలు వెనుకుట్టు పట్టే మళ్ళా వానలు కురిశాక మళ్ళా విత్తనాలు చల్లే పరిస్థితి! ఇదంతా రైతులను అప్పుల్లో దింపుతున్నది కద మామయ్యా!" అన్నాన్నేను.

"అందుకే గదమ్మ మామూలు సన్నకారు రైతుల మీద కూడా రుణాల భారం పెరిగిపోతున్నది. దాంతో తట్టుకోలేక అప్పుల వాళ్ళ పీడింపులకు మానసిక చింతలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అన్నాడు మామయ్య.

"ఏమో మామయ్యా! వ్యవసాయం అంటే పెద్ద జూదంగా మారింది. బోలెడంత పెట్టుబడులు పెట్టి ఆ పెట్టుబడులన్నా వెళ్తాయా? లేదా? అని రైతులు తలలు పట్టుకుంటున్నారు. దాంతో వాళ్ళకు ఒత్తిడులు పెరిగిపోతున్నాయి. ఆ ఒత్తిడులకు తట్టుకోలేక ఇంతకుముందు చేసిన రుణభారాలను తలచుకొంటే ఎవరికైనా నిరాశగానే వుంటుంది మరి!" అన్నాన్నేను.

"అదేనమ్మ ఇంతకుముందు రైతులిట్లా నిరాశలపాలై ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళు కాదు గద. ఇప్పుడెందుకు ఆత్మహత్యల పాలవుతున్నారు. ఒక్కొక్కసారి కుటుంబానికి కుటుంబమే ఆత్మహత్యల పాలవుతున్నారు." అని మామయ్య ముగించక ముందే నేనందుకున్నాను.

"మునుపు ఇంత పెట్టుబడుల భారం రైతుల మీద వుండేది కాదు మామయ్యా! అవునా! తమ పశువుల పెండ, తొక్కిన గడ్డి చెత్త చెదారాన్ని మక్కబెట్టి దాన్నే ఎరువుగా వాడుకునే వాళ్ళు రైతులు. ఒక్కొక్కసారి పాటిమట్టి అని పోసేవాళ్ళు లేదా చెరువులో చేరిన ఒండుమట్టిని ఎరువుగా పొలాల్లో పోసుకునే వాళ్ళు. దాంతో చెరువు పూడిక తీయటం జరిగేది, వాళ్ళకు ఎరువు మట్టి దొరికేది. విత్తనాలు ఇక ఇంటివే. ట్రాక్టరుతో దున్నించే భారం లేదు. నాగలి తోలుకునే వాళ్ళు. అట్లా రైతుల వ్యవసాయ పద్ధతే మారిపోయింది. దాంతో రుణభారాలు పెరిగాయి. అంతేనా మామయ్యా!" అన్నాన్నేను.

"అంతే అమ్మాయి! ఇంకో మాట–అసలు ఈ కొత్త ఎరువులు వాడకంతో పంట దిగుబడి అప్పటికప్పుడు బాగానే వస్తుంది కానిభూమి పూర్తిగా చౌడు నేలగా మారిపోతున్నది. దాంతో మరుసటి యేడు మరింత ఎరువులు గుప్పవలసి వస్తున్నది. ఈ సిల్‌సిలా అట్లా పెరుగుతూనే వుంది. భూములు పూర్తిగా పాడయిపోయి పనికిరాకుండా పోతున్నాయి. కేవలం ఆ ఎరువుల మీదనే పంట వస్తున్నది. కాని మట్టి గుణం నేల రుచి ఏం వుండటం లేదు అమ్మాయి! ఏమిటో ఈ వ్యవసాయ పద్ధతులు ఎంతవరకు పోతాయో తెలియకుండా వుంది. అంతేగాదు విత్తనాలు అమ్మేవాళ్ళ మీద ఎటువంటి నిఘాలు లేవు. దాంతో ఏ విత్తనాలు అమ్ముతున్నారో ఎవరికీ తెలియదు. దాంతో నష్టపోయేది రైతులు! పట్టించుకునే నాథులు లేరు!" నిట్టూర్చాడు మామయ్య.

"ప్చ్!... మన దేశం ఇంతమాత్రం స్వావలంబనంతో వున్నదంటే రైతులు మూలకారణం. ఎన్ని కష్టనష్టాలకు ఓర్చి అయినా రైతులు భూమిని నమ్ముకొని వ్యవసాయాలు చేస్తున్నారు. పంటలు పండించి జనానికి తిండిపెడ్తున్నారు. అటువంటి అన్నదాతలను ఆదుకోక నిర్లక్ష్యం చేస్తే మనమిక ఏం అభివృద్ధి సాధించినట్లు? మన దేశ దారిద్ర్యం ఇక తీరేదెట్లా?" ఆవేదనగా నాలో నుంచి వచ్చాయి ఈ మాటలు.

పి.ఎం.సుందరరావు

మారిన రాజు

ఉజ్జయినీ దేశ రాజు రంగనాథ రాయలు. అతడు భోగలాలసుడు. పాలనా విషయాలు పట్టించుకునేవాడు కాదు. కొందరు మంత్రులు దీన్ని అవకాశంగా తీసుకున్నారు. ప్రజల దగ్గర అధిక పన్నులు వసూలు చేయసాగారు. పైగా సంక్షేమ కార్యక్రమాలను విడిచిపెట్టారు.

ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతూ, నానా బాధలు పడసాగారు. ఒకసారి వారంతా రంగనాథరాయలకు తమ గోడును వినిపించుకోటానికి వెళ్లారు. రాజభటులు ఏదో ఒక సాకు చెప్పి వెనక్కి పంపించారు. మహామంత్రి వీరేశుడు అన్నీ గమనిస్తూ కూడా ఏమీ చేయలేక తగిన సమయం కోసం ఎదురుచూడసాగాడు. కొంతకాలానికి విందు, వినోదాలతోకూడిన జీవితం మీద రంగనాథరాయలుకి విసుగెత్తింది. కొత్తదనం కోసం అర్రులు చాచాడు. ఆస్థాన మంత్రులను అడిగితే ప్రత్యామ్నాయం చూపలేకపోయారు.

మహామంత్రి వీరేశుడు ఇదే మంచి సమయమనుకుని, "మహారాజా! రోజూ అవే వినోద కార్యక్రమాలను, అంతఃపురంలోని ఒకేరకం మనుషులను చూడటం విసుగ్గానే వుంటుంది. మీకు మార్పు కోసం నేనొక ఉపాయం ఆలోచించాను" అన్నాడు.

"అదేదో త్వరగా చెప్పండి. దానిని ఆచరణలో పెడదాం" అన్నాడు.

"మనమిద్దరం మారువేషాల్లో రాజ్యమంతా పర్యటిద్దాం. వివిధ రకాల మనుషులను కలవటం, వారి వేషభాషలను గమనించటం ఎంతో ముచ్చటగా వుంటుంది" అని చెప్పాడు.

రంగనాథరాయలు సరేననడంతో ఇద్దరూ మరునటి రోజే బయలుదేరారు. ఊళ్లన్నీ కళాకాంతులు కోల్పోయి, శ్మశాన వాటికల్లా వున్నాయి. ప్రజలంతా బక్క చిక్కిపోయి అస్థిపంజరాల్లా వున్నారు. ఇదంతా రంగనాథరాయలకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

మధ్యాహ్నానికి బాగా ఆకలవటంతో మహామంత్రికి విషయం చెప్పాడు. వీరేశుడు ఒక ఇంటి తలుపు తట్టి, "అయ్యా! మేం చాలాదూరం నుండి నడిచి వస్తున్నాం. బాగా ఆకలిగా వుంది. కాస్త అన్నం పెట్టి, పుణ్యం కట్టుకోండి" అని బతిమాలాడు.

ఆ ఇంట్లోని వారు, "అయ్యా! మీరెంతో ఇబ్బందుల్లో వుండి అన్నం అడుగుతున్నారని తెలుస్తోంది. కానీ ఇప్పటి పరిస్థితుల్లో ఎవరికి వారు బతకటమే కష్టంగా వుంది. మీకు మంచి భోజనం పెట్టలేము. ఉన్నదే పెడతాం" అని ఇద్దరికీ జొన్న రొట్టెలు, కొరివి కారం వడ్డించారు.

రంగనాథరాయలకు అది సహించకపోయినా, ఆకలిగా వుండటంతో కొద్దిగా తిని లేచాడు. కానీ తర్వాత, 'మీరింత దీనస్థితిలో వుండటానికి కారణమేంటి?' అని వారిని అడిగాడు.

"మీకు తెలియనిదేముంది! మన రాజు పరిపాలన గురించి అస్సలు పట్టించుకోవడంలేదు. మంత్రులు పన్నులు వసూళ్లు చేసుకుని, తమ ఆస్తుల్ని పెంచుకుంటున్నారు గానీ ప్రజల బాగోగుల గురించి పట్టించుకోవడంలేదు. రాజుగారిని కలిసి విన్నవించుకునే అవకాశం రాజభటులివ్వటం లేదు" అని చెప్పాడు.

విషయాన్ని అర్థం చేసుకున్న రంగనాథరాయలు, "మహామంత్రీ! మీరు నా కళ్లు తెరిపించారు. మనం వెంటనే రాజధానికి వెళ్దాం. ప్రజలకు చేయాల్సిన పనులు చాలా వున్నాయి" అని బయలుదేరాడు.

ఆస్థానాన్ని చేరుకున్న తర్వాత విషయాలన్నీ వాకబు చేసి చాలామంది మంత్రులను మార్చివేశాడు. విందు వినోదాలకు దూరంగా వుండి, పాలనపై శ్రద్ధ వహించాడు. కొద్దిరోజుల్లోనే ప్రజల కష్టాలు తీరాయి.



చిన్నారి చిత్రకారులు



డి.మల్లేశ్వరరావు, 8వ తరగతి, పెద్దబొడ్డేపల్లి, నర్సీపట్నం, విశాఖ.

కె.సురేష్ కుమార్,
8వ తరగతి,
జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల,
ధర్మారం,
కరీంనగర్.



జక్కంశెట్టి లోక్‌చరణ్‌తేజ, 9వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆచంట.



ఎ.శ్రీరామ్, 9వ తరగతి, ఆంధ్ర పబ్లిక్ స్కూల్, హరిపాలెం.

వి'చిత్రం'



హాయ్‌! త్వరగా రావాలి. పక్కన ఒక చక్కటి దృశ్యం వుంది. చూశారుగా ఆ బొమ్మలో మీకు ఏవేం కనిపిస్తున్నాయి? బాగా పరిశీలనగా చూసి చెప్పండి తొందరేంలేదు.
'ఆ... మాకు కొండలు ఉదయిస్తున్న సూర్యుడు, కొబ్బరి చెట్లు, జలపాతం, - మబ్బులు కనిపిస్తున్నాయి. ఇంకా ఓ అమ్మాయి కూడా వుంది' అంటున్నారు చాలా మంది నేస్తాలు. కానీ... చిన్నారులూ... ఆ అమ్మాయి వెంట్రుకలు ఎక్కడున్నాయి? 'ఓస్! అవా? అవీ.... ప్రవహించే జలపాతమే ఆ అమ్మాయి వెంట్రుకలు' అని చెప్తున్నారు మిత్రులంతా. మరి ఇంత చక్కటి బొమ్మ వేయడమంటే మాటలు కాదు కదా. చప్పట్లు కొట్టి ఆ ఆర్టిస్టు అంకుల్‌ని అభినందిద్దామా!

రంగులు పులిమేద్దాం!

వంట గది

M	O	T	O	A	S	T	E	R	W	B
P	I	P	L	R	S	L	I	C	E	N
R	R	C	E	W	I	Q	D	M	A	E
E	E	G	R	N	O	T	I	P	K	M
H	C	R	E	O	E	B	S	A	E	R
E	I	A	V	J	W	R	B	A	N	C
A	P	T	W	U	Z	A	S	S	Z	N
T	E	E	W	P	S	U	V	S	S	O
Q	W	M	I	A	R	B	P	E	M	O
P	I	H	L	E	C	L	E	A	N	P
X	W	T	P	E	P	P	E	R	V	S

ఇంగ్లీషు పజిల్-7

సర్కస్ పజిల్‌కు చాలామంది నేస్తాలు సమాధానాలు రాశారు. కాకపోతే ఎక్కువమంది పప్పులో కాలు వేశారు. ఎలాగంటే... సర్కస్‌కు సంబంధించిన జంతువులు, వస్తువులు, పదాలను ఈ పజిల్‌లో వున్న అక్షరాలలో కనిపెట్టి రాయమన్నాం. అంతేకానీ వరసపెట్టి జంతువుల పేర్లు రాయమనలేదుకదా.

సరే... ఈ వారం మీకు ఎంతో ఇష్టమైన వంట గదికి సంబంధించిన పజిల్‌ను ఇస్తున్నాం. ఇలా ఎందుకంటున్నామంటే... మీకిష్టమైన తిండి పదార్థాలు తయారయ్యేది అక్కడేకదా. అందుకు.

మీకు వంటగదిలో కనిపించే 18 వస్తువులు ఈ పజిల్‌లో ఎక్కడ వున్నాయో చూడండి. మీరు కనిపెట్టిన పదాలను కార్డుమీద రాసి మాకు పంపండి. మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పజిల్-6 సమాధానం

BARBERS	GUM	SCISSORS
BOOSTER	HAIR	SHAMPOO
BROOM	MAGAZINES	SINKS
CHAIR	MIRROR	SWEEP
CLIPPERS	POLE	TOWELS
DRYER	RAZORS	TOYS

పజిల్ - 5కు సమాధానాలు రాసినవారు

(పేరు పక్కన వున్న నెంబరు వారు గుర్తించిన పదాల సంఖ్య)

పి.పావని (13) జి. విమల (15) 7వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **జి.శ్వేత (2), 10వ తరగతి**, విజయవాడ. **వి.ఇంద్రసేన (3), పి.అశోక్ (3)** 8వ తరగతి, భువనగిరి, నల్లగొండ. **గొల్లా స్వాతి ప్రియ (8)**, 7వ తరగతి, దామరమడుగు, నెల్లూరు.



వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

నేస్తాలూ! ఈ వారం ఒక తాతయ్య ఫొటో ఇచ్చాం. చూశారుగా. ఆయన మంచి బెంగాల్ కవి. మన దేశంలో మొదటిసారిగా నోబెల్ బహుమతి అందుకున్న గొప్ప వ్యక్తి. వెంటనే కార్డు తీసుకుని ఆయన పేరు రాసి ఇవాళే ... ఇప్పుడే పోస్టు చేయండి. మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: వీరి పేరేమి? బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్‌నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

గతవారపు జవాబు: మదర్ థెరిస్సా / **సరైన సమాధానం రాసినవారు**

ఎం.డి.ఇమ్రాన్ ఉద్దీన్ సిద్ధిక్, 9వ తరగతి, పరిగి. **నాగేశ్వరరావు**, 9వ తరగతి, తాడేపల్లి. **ఎస్‌కె పర్వీన్**, చీమకుర్తి. **టి.నవీన**, 6వ తరగతి, మంచిర్యాల. **వి.బసవలింగం, వై.శ్యామ్‌కుమార్, కె.భానుప్రకాష్**, 7వ తరగతి, బ్రహ్మపురం. **జి.హారిక**, 8వ తరగతి, **ఐ.నవీన్**, 6వ తరగతి, పెడన. **ఎస్.గోపాల్**, 10వ తరగతి, మురిమడుగు. **బి.సుశీల**, 9వ తరగతి, నగరం. **పి.రాజేష్**, 9వ తరగతి. **పి.స్వరూప**, 10వ తరగతి, ఈమని. **కె.వనజ**, 9వ తరగతి, ప్రత్తిపాడు. **పి.మాధురి సంఘమిత్ర**, 8వ తరగతి, నర్సీపట్నం. **జె.విజయకృష్ణ**, 7వ తరగతి, జైత్వారం. **హుస్సేన్**, 4వ తరగతి, ముజాహిద్‌పూర్. **టి.శ్రీకాంత్**, 1వ తరగతి, రామారం. **డి.సావిత్రి**, 10వ తరగతి, గుత్తి. **ఎం.మౌనిక**, 6వ తరగతి, మక్తల్. **ఎం.ప్రశాంత్**, 7వ తరగతి, ఆదిలాబాద్. **ఆర్.రమేష్**, 9వ తరగతి, భువనగిరి. **జి.సాయికళ్యాణ్‌ప్రసాద్**, 5వ తరగతి, పాలకొల్లు. **పి.తులసి మానస**, 3వ తరగతి, నాయునిపల్లి. **సిహెచ్ అజిత్‌సాయికృష్ణ**, 3వ తరగతి, పార్వతీపురం. **కె.పరిమళ**, 9వ తరగతి, **బి.వెంకటరమణ**, 6వ తరగతి, కొమరాడ. **కె.ఆనంద్**, 7వ తరగతి, **కె.మాధురి**, 3వ తరగతి, మన్ననూరు. **పి.ఎస్.వివేక్**, 8వ తరగతి, వనపర్తి. **డి.సంతోష్**, 9వ తరగతి, **డి.అక్షయ్‌కుమార్**, 4వ తరగతి, జనగామ. **ఎం.లక్ష్మి** 9వ తరగతి, కాటవరం. **ఎస్.శరత్‌చంద్ర**, 8వ తరగతి, వనపర్తి. **ఎం.సత్యనారాయణ**, హైదరాబాద్.

రాజహంస

హేయ్! పోయిన వారం పేపర్ పప్పీ చేసేసినట్టున్నారే. మరి ఈ వారం మీకోసం హంసను తీసుకొచ్చాం. ఎంచక్కా పేపర్‌తో చెయ్యొచ్చు. ముందు చతురస్రాకారపు కాగితాన్ని తీసుకోండి. దాన్ని 1వ బొమ్మలో చూపించినట్టు రెండు చేతులతో పట్టుకోండి. కుడిచేతివైపు నుంచి ఎడమచేతి వైపు మధ్యకు మడవండి. తర్వాత మడతను తీసేసి మామూలుగా పట్టుకోండి.

1


2


ఇప్పుడు మధ్యలో మడతనుంచి కిందవైపు నుంచి త్రిభుజాకారంలో మడవండి. ఇలా రెండు వైపులా మడవాలి.

తర్వాత ఏం చెయ్యాలంటే... పేపర్ కిందిభాగం కోన్‌లా వుందికదా. దాన్ని పైన రెండు కాగితాలు కలిసేంత వరకు మడతపెట్టండి. ఇప్పుడు చూస్తే కాగితం అంతా నాలుగు త్రిభుజాకారాల్లో కనిపిస్తుంది.

3


4


ఇహ... మనం హంసగారికి ముక్కు తయారుచెయ్యబోతున్నామన్నమాట. ఇందాక కోన్‌లాంటి భాగాన్ని పైకి మడిచాంకదా. ఇప్పుడు దాన్నే కొద్దిగా మళ్లీ కిందకి మడవాలి. అంతే హంస ముక్కు రెడీ.

చివరిగా.... పైన సిద్ధం చేసుకున్న కాగితాన్ని మధ్యకు మడవండి. తర్వాత రెక్కలను కొద్దిగా పైకి లాగాలి. ముక్కుకూడా కొంచెం పైకి పెట్టాలి. అంతే రాజహంస రెడీ. ఇలా రంగురంగుల కాగితాలతో హంసలను చేసి గదిలో అక్కడక్కడా వేలాడగడితే అదిరిపోద్ది. **వచ్చేవారం మరో చక్కటి బొమ్మతో మీ ముందుంటాం. బైబై.**

5


పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

ఆదివారం ఉదయం పదిగంటలైంది. ముంబై న్యూ ఆడిటోరియంలో చాలా సీట్లు నిండిపోయాయి. అనేక మంది వాహనాలపై వచ్చి గుంపులుగా లోపలికి వస్తున్నారు. గ్రాఫాలజీ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమం.

వృద్ధ యువతి

నగరంలో చేతిరాతల పోటీని నిర్వహించి అందులో బహుమతులను అందుకున్న విజేతలను సత్కరించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం అది. మూడు విభాగాలుగా పోటీలను నిర్వహించారు. యువతరానికి, గృహిణులకు, వృద్ధ మహిళలకు వేరువేరుగా పోటీలు ఏర్పాటు చేశారు.

అరటావు సైజులో తమ మనోభావాలతో రాసిన కాగితాలను అన్నింటినీ దగ్గర ఉంచుకుని అందులో ఉత్తమమైన వాటిని ఎంపిక చేశారు.

విజేతలకు ముందుగా సమాచారం అందించారు. వారందరూ ఆడిటోరియంలోకి చేరుకుని ముందువరుస కుర్చీల్లో ఆశీనులయ్యారు. మేయరు, శాసనసభ్యులు ఇతర ప్రముఖులు కూడా విచ్చేశారు. పదకొండు గంటలకు కార్యక్రమం మొదలైంది. ప్రముఖుల్ని వేదికపైన ఆహ్వానించారు.

కులభూషణ్ కార్యక్రమ వివరాలను ఆహూతులందరికీ తెలియజేశారు – "ఇటీవల కాలంలో గ్రాఫాలజీకి ఎంతో ప్రాధాన్యత పెరిగింది. చేతిరాతను బట్టి మనిషి వ్యక్తిత్వాన్ని చెప్పవచ్చు. రాతలో స్పష్టత ఆధారంగా ఆ వ్యక్తి మనస్తత్వం ఏ విధంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. ఈ విషయాలను అధ్యయనం చేయడానికి చేతిరాత పోటీలను నిర్వహించాం. ఎంతోమంది ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి చేతిరాత ఆధారంగా మనస్తత్వాన్ని వ్యక్తిత్వాన్ని అంచనావేసి బహుమతులను నిర్ణయించాం..."

తర్వాత వేదికను అలంకరించిన వారిలో ఒక్కొక్కరు చేతిరాతకు సంబంధించిన విషయాలను తెలియజేశారు.

విషయం చాలా కొత్తది అయినందువల్ల ఎంతోమంది ఆసక్తిగా విన్నారు. చేతిరాతల ఆధారంగా ఎవరెవరికి బహుమతులు వచ్చాయో అని ఎదురుచూస్తుండగా నిర్వాహకులు ఒక్కొక్కర్ని వేదికపైకి ఆహ్వానించారు.

మూడు విభాగాల్లో తొమ్మిదిమంది బహుమతులను నగర మేయరు నుంచి స్వీకరించారు.

వారందరిలో పెద్ద వ్యక్తిగా ఉండి వృద్ధుల విభాగంలో ప్రథమ బహుమతి పొందిన మహిళ అందర్నీ ఆకట్టుకుంది.

'లక్ష్మీ రాఘవన్' పేరు పిలవగానే 75 సంవత్సరాల వయసు కలిగిన ఆమె చకచకా స్టేజి మీదకు వెళ్ళింది. మేయరు చేతుల మీదుగా ప్రథమ బహుమతిని స్వీకరించింది. ఆమె హుషారు, ఉత్సాహం, చలాకీతనం చూసి వేదికపైన కూర్చున్నవారు, వేదిక కింద కూర్చున్నవారు చప్పట్లతో స్వాగతించారు.

ఆమె బహుమతి అందుకుని వెళ్ళిపోయే ముందు కులభూషణ్ ఆమెను ఆపారు. "మంచి చేతిరాత మనిషి, పట్టుదల గల వ్యక్తి అని అర్థం అయ్యింది. గ్రాఫాలజీ విశ్లేషకులు ఈమె విషయాన్ని ప్రత్యేకంగా గుర్తించారు. ఏ విషయంలోనూ రాజీ పడకుండా నిరంతర పట్టుదలతో ముందుకు సాగిపోయే వ్యక్తి అని నిర్ధారించారు. ఈమె దస్తూరి ఆధారంగా ప్రథమ బహుమతికి అర్హురాలు అనిపించింది. అందుకే ఏకగ్రీవంగా బహుమతి సిఫార్సు చేశారు..." పరిచయం చేశారు.

బహుమతులు అందుకోవడానికి వేదికపైకి వచ్చిన ఒక్కొక్కరి గురించి నిర్వాహకులు పరిచయం చేసినప్పటికీ లక్ష్మీ రాఘవన్ పరిచయం మాత్రం అందరినీ ఆకట్టుకుంది. ఎంతోమందికి ఆమె రూపం గుర్తుండిపోయింది. నిండు ముత్తయిదువ మాదిరిగా వున్న ఆమెను చూస్తుంటే చేతులెత్తి మొక్కాలని అనిపిస్తుంది.

చేతిరాతలో బహుమతి అందుకున్న ఆమె జీవితంకూడా ఎంతోమందికి ఆదర్శనీయమైనదేనని పరిశీలించిన వారికి తెలుస్తుంది.

వేదిక దిగిన తర్వాత ఆమె తన సీట్లో కూర్చుంది. తర్వాత వరుస కార్యక్రమాలు జరిగాయి.

సమావేశం ముగిసింది.

ఆమె సెల్‌ఫోన్ తీసుకుని ముంబాయి ఐ.డి.బి.ఐ.లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కొడుకు ప్రసాద్‌కు రింగ్ చేసి "సమావేశం పూర్తయింది.... నువ్వు వస్తున్నావా;?" అడిగింది.

"లేదమ్మా! నేను అర్జంటు మీటింగ్‌లో వున్నాను. డ్రయివర్‌కు కారు ఇచ్చి పంపుతున్నాను. జాగ్రత్తగా ఇంటికి వెళ్ళిపో..." అన్నాడు.

తనతో వచ్చిన ఇద్దరు ఆడవాళ్ళను తీసుకుని ఆడిటోరియం బైటికి వచ్చింది.

ఆ సమయంలో అక్కడికి వచ్చింది ప్రెస్ రిపోర్టర్ బొల్లాప్రగడ వెంకట రమణి... "నమస్తే!" అంటూ తనని పరిచయం చేసుకుంది... "చేతి రాతలో ప్రథమ బహుమతి పొందినందుకు అభినందనలు.. మీ గురించి రాయాలని ఉంది... మీ వంటి వారి విషయాలు మా పాఠకులకు ఆసక్తిని కలిగిస్తాయి!" అంది.

లక్ష్మీ రాఘవన్ చిన్నగా నవ్వింది.

హేండ్‌బేగ్‌లోంచి పుస్తకం తీసి అందులో ఒక కాగితాన్ని చింపి – "ఎప్పుడైనా ఖాళీ వున్నప్పుడు రా... అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు.. పేపర్లో రావడం నాకు అంతగా ఇష్టం ఉండదు... నా మనవరాలిలా అనిపిస్తున్నావు!" అంది.

అలా అంటుండగానే బ్యాంకు మేనేజర్ కారు వచ్చి ఆగింది. లక్ష్మీ రాఘవన్ తనతో వచ్చిన వాళ్ళతో కారు ఎక్కి చేతులను ఊపింది. ప్రతిగా రమణి కూడా చేతులు ఊపి వీడ్కోలు పలికింది.

తర్వాత ఆమె గురించీ చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయింది.

* * *

75 సంవత్సరాల వయస్సు గల లక్ష్మి ఉత్సాహానికి ప్రతీక. ఏ పని అయినా పట్టుదలతో సాధించాలన్న తపనతో తన జీవితాన్ని ఎందరికో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుంది. నిరాశతో ఏదీ సాధించలేమని కృంగిపోయే ఎంతోమంది లక్ష్మి జీవితాన్ని ఉదాహరణగా చూపించుకోవచ్చు. లక్ష్మి అయిదవ తరగతి వరకు మాత్రమే చదివింది.

తల్లి అనసూయ అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవడంతో ఆమెకు సేవలు చేయడానికి చదువుకు స్వస్తి చెప్పింది. బడిలో చదవకపోయినా చదువుకు మాత్రం దూరం అయిపోలేదు.

1945లో రాఘవన్‌తో వివాహం జరిగి లక్ష్మీ రాఘవన్‌గా మారిపోయింది. ఆయన కేంద్ర ప్రభుత్వంతో ఉద్యోగి తరచూ జరిగే బదిలీలతో దేశంలో వివిధ పట్టణాల్లో నివసించారు. ఆమెకు తగినంత ఖాళీ సమయం లభించింది. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం ప్రవేశ పరీక్ష రాసి అర్హత పొంది తమిళ సాహిత్యంలో ఎం.ఏ. పాసయ్యారు.

సంగీత సాహిత్యాలపై మక్కువ కలిగి సాహిత్య కృషి ప్రారంభించారు. తమిళ, సంస్కృత భాషల్లో భక్తి గీతాలు రాయడం ప్రారంభించారు. సంగీతంలో ఎటువంటి శిక్షణ లేకపోయినా అందులో ప్రవేశాన్ని సంపాదించారు. రాగతాళాలతో నాలుగువేల భక్తి గీతాలను రాశారు. ప్రతి గీతంలో ఒక ప్రత్యేకత చూపిస్తూ అంత్య ప్రాసలతో రాయడంలో ప్రత్యేకత సంపాదించారు. శ్రీ కంచి చంద్రశేఖర సరస్వతిపై పంచరత్న హారం పేరుతో అయిదు రాగాల్లో కీర్తనలు రచించారు. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం

(మిగతా 17వ పేజీలో)

గుత్తివంకాయకూర

లక్ష్మి

అలక–
ఒక అందమైన కార్యక్రమం!
అప్పుడప్పుడు–
అలకపాన్పు
అలంకరిస్తూవుండాలి!

అంతేతప్ప...మేము చిలకా గోరింకలమనే బోర్డు చేత్తో పట్టుకుని ఇంటాబయట కాలక్షేపం చేస్తుంటే– అదేదో పబ్లిసిటీ స్టంటనుకునే ప్రమాదముంటుంది!

ఎవరో ఏదో అనుకుంటారని కాదుగానీ–

ఆ టైపు దాంపత్యంలో థ్రిల్లుండదు!

టైం టేబుల్ మాదిరి ఈ వేళకిది ఆ వేళకది అనే పద్ధతిలో వాళ్ళ దినచర్య నడుస్తుంది. బతికినంతకాలం– ఆ మాదిరే బతకాలనే రూలు బోరుకొడుతుంది!

అంచేత–

వెరైటీ కోసమైనా వాళ్ళ టైం టేబుల్లో రొటీను దినచర్యకి విరుద్ధంగా కొన్ని ఫీట్లు చోటు చేసుకోవాలి!

అందుకు అలక బాగా సూటవుతుంది!

భార్యాభర్తలన్న తర్వాత–

వాళ్ళ మధ్య అప్పుడప్పుడు తగవులుండాలి!

తగవుల కారణంగా అలకలుండాలి!

అలిగితివా ప్రియా సఖీ... అలకమానవా అనే బాణీలో ప్రాధేయపడటాలుండాలి. తప్పయిపోయింది... క్షమించండనే వేడుకోలుండాలి. రాజీపడటాలుండాలి!

ఆనక ఒకర్నొకరు క్షమించుకోడాలుండాలి!

ఇన్ని వుంటేనేగానీ ఆ దాంపత్యం రక్తి కట్టదు!

అయితే...

ఆ కోపతాపాలుగానీ, అలకలుగానీ కళాత్మకంగా వుండాలేగానీ– శృతిమించిపోతే బతుకుబండి బోల్తాపడుతుంది!

ప్రతిరోజూ–

ఫైటింగు సీన్లతో వాళ్ళ సినిమా నడుస్తుంది!

వారు చెంప ఛెళ్ళుమనిపిస్తే–

వీరు వీపుమీద డోలు వాయిస్తారు!

వాళ్ళ ఇల్లు సినిమా థియేటరవుతుంది. ఆ థియేటర్లో అన్నీ స్టంటు సినిమాలే నడుస్తుంటాయి!

ఇరుగుపొరుగు ప్రేక్షకులవుతారు!

టిక్కెట్టు లేకుండా ఫ్రీగా ఆ సినిమాలు చూస్తుంటారు. వాళ్ళు చూసిన సినిమాని–కథ మాటలు స్క్రీన్‌ప్లేతో సహా– ఇతరులకు చెప్పి ఒకపనైపోయిందని సంబరపడతారు!

అస్తమానం–

స్టంటుసీన్లతో నడుస్తున్న ఆ సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య మాటామంతీ బందవుతుంది!

ఎంతసేపటికీ–

వాళ్ళు తలుపులూ కిటికీల్తోనే మాటాడుతుంటారు!

అతను ఆమెతో ఏం చెప్పాలనుకున్నా కిటికీలకు చెబుతుంటాడు. ఆమె అతనికి ఏ సలహా యివ్వాలనుకున్నా తలుపులాడిస్తూ వుంటుంది!

అంచేత–

అతనిపేరు ఆమె...ఆమె పేరు అతను దాదాపు మరిచిపోతారు!

ఇంత అల్లరికి అలక అనే పేరెందుకు సూటవుతుంది ? ఈ విన్యాసాన్ని యుద్ధమనే పేరుతోనే పిలవాలి!

ఆ ఇంట్లో–

టించరూ... దూదీ వగైరాల వాడకం ఎక్కువగా వుంటుంది. ప్లాస్టర్ల వినియోగం కూడా అధికంగానే వుంటుంది!

అతను ముక్కుమీద ప్లాస్టర్లతికించుకున్నా –

ఆమె చేతికి కట్టు కట్టుకుని కనిపించినా –

అదంతా యుద్ధ ఫలితమేనని –

ఇతరులు సులువుగా గ్రహించ గలుగుతారు!

అలకల్లో ఇల్లాంటి బీభత్స దృశ్యాలు చోటు చేసుకోవు. కాఫీ కప్పు గోడకి తగిలి ముక్కలవుతుంది. లేదా – ఫ్లయింగ్ సాసరకి ఏ మాత్రం తీసిపోని విధంగా – అన్నం కూరల్లో నిండిన కంచం గాల్లో ఎగుర్తుంది!

ఇది మార్నింగు సీను!

ఈవినింగు సీను కొంచెం డ్రెమెటిగ్గా వుంటుంది!

అతను ఆఫీసు నుంచి గొప్ప నీరసంగా ఇంటికి వస్తాడు. భోం చేయకుండా ఆఫీసుకెళ్ళిన ప్రతి మగమారాజూ – సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేప్పుడు అదే టైపులో వస్తాడు గదా?

అతనూ అంతే!

అతను ఇంట్లోకాలు పెడుతూనే వంటగది నుంచి వంట తయారీ తాలూకు వాతావరణం పసిగడతాడు!

వంట గదిలోకి వెళ్ళకుండానే –

అక్కడ తయారవుతున్న వంట వివరాలు తెలుసుకోగలుగుతాడు. తనకెంతో ఇష్టమైన గుత్తివంకాయ... పప్పుదోసకాయ... క్లాస్‌వన్ రసం... అప్పుడాలొడియాలు... ఆఫ్‌కోర్స్ – అత్తగారు పంపిన ఆవగాయ...

“అదరహ' అనుకుంటాడు!

మగపుట్టుక పుట్టిం తర్వాత బెట్టుగానే వుండాలి గనక – ఆఫ్టరాల్ వంటకాలకు పడిపోయి అలకవ్రతాన్ని పాడు చేసుకోకూడదని మవునం వహిస్తాడు!

స్నానం గట్రాలు కూడా మవునంగానే ముగిస్తాడు. పడగ్గదిలో పాత పేపర్లు మవునంగానే చదువుతూ కూచుంటాడు!

రాత్రిసీనూ రసవత్తరంగా నడుస్తుంది!

లేవండి – వడ్డిస్తాను అంటుందావిడ. ఆకలిగా లేదంటాడతను. ఆవిడ పక్కగదిలో పక్క సర్దుకుంటుంది!

అర్ధరాత్రి... ఆకలికి తాళలేక... గుత్తి వంకాయ పిలుపుకి తట్టుకోలేక.. దొంగవలె వంట గదిలోకి వెళ్ళిపోయి... శబ్దం కాకుండా వడ్డించుకుతింటూ వుంటాడు. గుటుక్కురట్టు గాకుండా గబగబా మింగాలనే ప్రయత్నంలో గొంతులో ముద్ద – కడుపులోకి వెళ్ళకుండా మారాం చేస్తుండటంతో నీళ్ళుతాగి పరిస్థితిని చక్కబరుచుకోవాలనుకుంటాడు!

సరిగ్గా అప్పుడే –

ఆవిడ నీళ్ళగ్లాసు అందిస్తుంది! ఆ గ్లాసు అందుకుంటో –

“గుత్తి వంకాయ్ చేసేవు గదా! తట్టుకోలేకపోయేను సీతా!” అంటాడతను

క్లాసువన్ అలకసీనుకి –

ఆమె మందహాసం ఒక ముక్తాయింపు అవుతుంది!

"ఎనుకకు సూసుకుంటున్నరు.."

"ఇగో..రాజమల్లూ..!
పల్లెటూల్లు పల్లెటూల్లంటవు
నువ్వు..పల్లె జీవితాలే నయ్యమంటవు..
అందరు పల్లెల దిక్కే సుత్తున్నరంటవు..
మూలాలో గదేందో
ఎతుకుతంద్రంటవు.. అమెరికా
అసోంటి దేశాలల్ల గూడ గిట్ల
మూలాల దిక్కే సూత్తన్నరంటవు..
ఏదేదో పల్లెల గురించి బాగనే
సెప్పుతవు.. నువ్వెంత నిజాలు చెప్పినా
నాకయితె గీ సంగతులేం
మంచిగనిపిత్తలెవ్వు-ఏముందే గా
పల్లెటూల్లల...? ఏం పాడైందే గా
ఎనుకటి కాలంల...?
గప్పుడున్నదేంది?
కులపీడన...కులభేదాలు..ఎక్కోతక్కోలు..వడ్డీ
వ్యాపారాలు..ఏముంది గండ్ల..? పెద్ద
కులపోల్లు చిన్న కులపోల్లను
కించపరిచెటోల్లు.. మూఢ
నమ్మకాలుండేటియి..పంటలు సరిగ్గ
పండక పొయ్యేటియి..వానగొడితె
పండినట్టు..లేకుంటె ఎండినట్టేనాయె..

కాలువ మల్లయ్య

అరె బై..ఇంకెన్ని తీర్ల తిప్పలు...? కొట్లాటలు-పంచాయతులు... దండుగలు.. గదేదో అంటరు సూడు..ఫ్యూడల్ దొరతనాలు..గంతే కాదింక.. ఊళ్ళళ్ళ అంటరానితనముండేదిగద.. గిదెంత రోత.. గవ్వన్నిటిని చూసుకుంట గూడ గిట్ల మాట్లాడ్తవేంది.. ఏం నాశనమైందని గతంల...? అయినా నీకు గతం మీద గంత ప్రేమెందుకు ? చిన్న చిన్న కులాలోల్లకైతె గా కాలం గోరమైందే కదా.. కష్టమైందే కద.. గప్పుడు మనసోంటోల్లకు సదువుకునే అవుకాశాలే లెవ్వుగద.. మా నాయన్న నన్ను బడికి పంపించుటానికి దొర సలహానడిగిండు...గయనేమన్నడో ఎరికేనా ? "ఎవ్వడ పడితె వాళ్ళు సదువుతెట్లరో ? ఐదేళ్ళు ఒక్క తీరుగుంటాయిర ? నీ పోరన్ని నా ఎడ్ల గాసుటాని కుంచినవంటె ఇరుసు జొన్నలిత్త. గవ్వి వేన్నీల్లకు చన్నీల్లోలె నీకక్కెర కత్తయి.. సదివి రాజ్జేలేలుతాడ్ర పోరడు ?" అని కించపరిచిండు... నీకు మాత్తురం గిసోంటియి జరుగలేదా...? గొల్లని సాహిత్య విద్యనిరి... సాలె సంకుటం గోచిలిరుకుట మని ఎగ్సవెట్టిరి. బెస్త పెద్దరుకం చెప్పుల మోతని పేర్నాలు వెట్టిరి.. ఎల్లుతె ఎల్లాపు లెకుంటె గూలావని తక్కువ జేసిరి ..ఇంకా మాల ఏంకడగాడనిరి..మాదిగోడనిరి.. భాగోతులోడనిరి.. ఊల్లల్ల గా భోగమోల్ల గతెట్లుండె.. దొరుంచుకుంటె పుట్టినోల్లకు దిక్కెవ్వలు ?

అరరే.. కైకిలెంత పాడైందపుడు ? యాడాదంత జీతముంటె బట్టపొట్టకు పోంగ రొండు వందలేనాయె.. కైకిలి పావుల అర్దేనాయె... గద్సమాల్లు తొక్కు పులుసు గిట్ట దొరుకుతెక్కోనేనాయె..పాలేరోల్లకు చినిగిపోయిన బట్టలు ఇసిరేసిటోల్లు.. దళితులయి, చిన్న కులాలోల్ల బతుకులెంత గోరంగుంటేటియి.. ? గప్పుడు గీల్ల బతుకులెట్లుండేటియో నీకు తెలువదా ? నానోట్లె నువ్వేలు పెట్టు నీ కంట్లె నేనేలు వెడుతనని దొరలన్నట్టుండేయి .. గిట్ల బతుకులుంటె ఎనుకటెందో బాగ పాడైందని సెప్పవడ్తివి.. నేనన్న దాంట్లేమన్న తప్పుందా ?" అన్నడు వీర్రాజు.

రాజమల్లు దిక్కు కన్నుగిలుపకుంట సూత్తుండు...

వీర్రాజు దిక్కే నోరుదెరిసి సూడవట్టిండు రాజమల్లు- వీర్రాజు గింత జోకుగా మాట్లాడ్తాడని, గిన్ని సంగతులు మాట్లాడ్తడని గక్కడున్నోల్లనుకోలేదు. రాజమల్లను కోలేదు. కొంచెమాగన్నాడు.

"శబ్బాస్...! మంచిగ చెప్పినవోయ్ వీర్రాజు ... జబర్దస్తీగా ఉన్న సంగతులున్నట్టు సెప్పినవు. గిట్ల అందరు తెలివికి రావాలే...! కని నువ్వన్నదాంట్లో ఒక్కటి సవరిచ్చుకోవాలె... ఎనుకటి కాలం గొప్పదో, మంచిదో అని నేనన్లేదు. ఊల్లల్ల మనకున్న అనుభవాలన్ని దాదాపుగా ఒక్కతీరుయే. అసలు మనోల్లను ఊల్లల్లో మనుషులుగ జుసింద్రా...? గతం కూసోని తినేటోల్లకు, దొరతనాలు సాగించుకున్నోల్లకు గొప్పదే కావచ్చు. కని మనసోంటోల్లకు మాత్తురం గొప్పదేం గాదు. నువ్వన్నట్టు అన్ని తీర్ల అవుమానాలనిచ్చిందే. గతం గురించి నువ్వు చెప్పిందంతా సత్యమైందే. గప్పుడు గా దొరతనం భావాలు, కులభేదాలు గిప్పటి కంటెక్కో మస్తుగున్న మాట నువ్వద్దే...గిదీన్ని కాదంటలేను. కాని...కాని...గా గతం ఉన్న ముత్తెమంత మంచి గూడ మటుమాయమై పోవట్టె గదా అని నా బాధ! గిప్పుడు కొందరు...కొందరేంది సానమందే...మనీడోల్లు...అంతకంటె పెద్ద వయసోల్లు గూడ గా ఎనుకటికాలమే నయ్యంగుండె అంటున్నరంటె గండ్లెంత అరుతముందో ఆలోసించు. ఎవ్వలనడిగినా గట్లనే అంటున్నరంటె గా మాటలు వట్టిగనే వత్తయా? రాత పూతలోల్లు గూడ గా ఎనుకటి సంగతుల గురించి రాత్తున్నరా లేదా? మరి గిట్లెందుకైంతంది? గప్పుడు కులం, అంటరానితనం అసొంటియెన్నున్నా గా కాలమే మంచిగున్నట్టెందుకనిపిత్తంది? నిజానికి గిండ్ల ఎన్ని మతలబులున్నయెా ఎరికేనా? మన దేశంలో అందరికంటెక్కో అవమానాలకు గురై బతికిన దళితులు గూడ గట్లనే అనవట్రి. గిదేందన్నట్టు మరి...గిట్లుంటుంద్రని గతం అవ్వల్దర్జగుండెనని నేనెప్పుడన...? గిట్లంటున్నరంటె గతం గొప్పదని కాకపోవచ్చు...కాని గిప్పుడు గంతకంటెక్కో సమస్యలుండుడు కావచ్చుగదా...! నా బాధయితే గండ్లున్న కొంత మంచి గూడ పోవట్టేననే...!" అన్నడు రాజమల్లు.

గా మాటలు గూడ వాళ్ళందర్నీ ఆలోచనల పడేసినయి... వీర్రాజు ఎనుకటి రోజుల్ని యాజ్జేసుకుంటండు... గక్కడున్నోల్లందరికి ఏం మాట్లాడన్నో సమజయిత లేదు.

"ఆం...దేన్నయిన ఒనరిచ్చి చెప్పుట్ల నువ్వు జోర్దార్ మనిషివేనని నాకు మా ఎరికేకని గతంలేందో కొంచెమంత మంచున్నదంటున్నవుగద. గదేందో



 16 ● ఆదివారం ప్రజాశక్తి ● 19 సెప్టెంబర్ 2004

సెప్పలేదు" అన్నడు లక్ష్మిరాజం.

"ఇగో...గిసోంటి కాలడ్దాల్సిడి పెట్టి గిండ్లేముందో తెలుసుకుంటే మంచిది. వాదంతోని ఏం తేలయి. ఎందుకంటే ఎటంటటు వాదించవచ్చు. నిజాలను గ్రహించే గుణముంటె ఎన్నో తెలుత్తయి.

"గా మాట కాదంటలేమే రాజమల్లన్న...కని గా గతంలనో గా పల్లెటూళ్ళళ్ళన్నో ఉన్న మంచేందో చెప్పలేదు"

"గదే సెప్పుతున్న" అని సెప్పవట్టిండు రాజమల్లు.

"ఎనుకట ఎవుసాలు జేసెటోల్లా...పంటలు పండిచ్చెటోల్లా...ఎవుసాలెందుకు జేసిటోల్లు...? గదో బాధ్యతనుకునెటోడు రైతు...లాభాల నష్టాల గురించి ఆలోచించకపోవు...గప్పుడు గీ దిక్కుమల్లె మందులన్నీ గీ కావన ఏసేటోల్లా...? గిట్ల బాగ మందులేసుడుతో నేమైతంది...? భూమంత నాశినమైతందా...లేదా..? మరి గీ భూమ్మీద పంటలు పండించి తినుకుంటనే ఎప్పటికి జెనముండాలె గద..! మరి భూములు పాడయి పంటలు ఫుండక్కుంటయియితె అటెనంక జెనమెట్ల బతకాలె...? భూమిని బంగారు గుడ్డు పెట్టే బాతును కోసినట్టు కోత్తెల్ల?

గదట్ల పోనియ్...! గప్పుడు మనుషుల నడుమ ఎంత ముద్దుగ ప్రేమలుండేటియి? ఒగల్నొగలు వరుసలు పెట్టుకొని పిల్సుకునేటోల్లు...బిగ్గీత అలుముకునెటోల్లు...అలాయిబలాయ్‌లు తీసుకునెటోల్లు...గిప్పుడున్న ఇష పాతుకాలు, పట్టింపులు గప్పుడుండెనా..? పైసమీది మోజేకద మనుషులను దూరం చేసేది...ఫ్యూడల్ సమాజమేదో మంచిదని నేనంటలేను...కని గండ్లున్న గిసోంటి మంచిగూడ గిప్పుడు లేకుంటయి పాయెనని బాధ.. మనుషుల నడుమ మానవత పెరుగుటానికి బదులు విషాలు పెరుగవట్టె..పైస సంగతేమోగని దూరం పెరుగవట్టె... గప్పుడు ఎవ్వల పండుగల్లనైన అందరు పాలుపంచుకునెటోల్లు.

వేగమంటున్నరు...కాలంతో పాటు మారద్దంటలేను...ఉన్నకాడనే ఉండుమంటలేను. కని గివ్వన్ని దేని గురించి...? పైస గురించే కద... పైసమీద ప్రేమలు పెరిగి మనిషిమీద తగ్గుతున్నయి గద... సంబంధాలన్ని పైస సంబంధాలైతున్నయిగద...గిదీంతోని ఎంత ఒత్తిడి పెరుగుతుంది...పైసమీద విపరీతమైన ప్రేముంటే గదే లోకమైతె ఇగ జీవితంల సమాజంల సుఖముంటదా..?

అవ్వయ్యలను, సుట్టాలను, తన వాళ్ళను చూసుకునుట గప్పటికి గిప్పటికెంత తేడా ఉంది? మనోడు...మన దేశం అనేదున్నదా..? గట్లయితే పైస కోసురం దేశాన్నే విడిచిపెట్టి ఎందుకుపోతరు? ఇవ్వన్నిటి వెనుకున్నదేంది...? పైస... పైస... పైస...గిప్పేకద...! ప్రకృతికి దూరమవుడు అన్ని నాకే కావాలనుకునుడు...రేపేమయిన మంచిదే నేను సుఖంగుంటె చాలనుకునుడు...గివ్వన్ని సుఖాన్నిచ్చేటియేనా...? వనరులన్ని గిప్పుడే ఖతం జేత్తే ముందు తరాలోల్లు ఎట్ల బతుకాలె...? పల్లెలను కాదంటె పట్నాలల్ల ఎట్ల బతుకుతరు..? పంటలెక్కన్నుంచొత్తయి..? గా సంగతులన్ని ఆలోచించద్దా..? గిన్ని ఇషపాతుకాలు... ఒత్తిడులెందుకని...లొల్లిలొల్లిగ బతుకుడు కంటె ఊల్లల్ల చల్లగ బతుకుతె మంచిగుండదా...? మనిషి బతుకుటానికి అవసరమయ్యే బువ్వనిచ్చేటియి పల్లెలే కదా... మరి గా పల్లెలను గూడ ప్రకృతికి దూరం జేత్తెట్లు...? ఊల్లల్లున్న కుల అంతరాలు, అనవసర పెద్దిరుకాలు తీసేత్తె గవ్వెంత మంచిగుంటయి...గందుకే మొకంగొట్టి పల్లెలదిక్కు దృష్టిపోనిస్తున్నరంటరు. నాకైతే 60,70ల వరకు జరిగిన గా అభివృద్దో గదేందో సాలనిపిత్తది. ఎండ్లనుకున్నరు? సైన్సుల...అటెనుక ప్రకృతి దిక్కు సూత్తే మంచిగుండేదేమో....? గిది కొందరికి వెనుకబడిన ఆలోచననిపించచ్చు. కని మన ఊల్లల్లున్న అంతరాల కులపద్ధతిని తీసేత్తె మన దేశంలున్న గ్రామీణవ్యవస్థ గొప్పదనిపిస్తుంది. అయితె పనిజేసేటానికే అస్తులుండాలి. పనికే విలువండాలి. పనిజేసెటోడె గౌరవింపబడాలి. గట్లయితే జోరుదారుగుంటాది. కాదంటారా..."

రాజమల్లు దిక్కందరు పరేషానయి సూడబట్టింద్రు... గా మాటల్లున్న లోతు కొందరికందుతునే లేదు.

"గా ఎనుకటి కాలమే నయం..గా పల్లెలే నయం అనిపిచ్చుటానికి వెనుకెంతో ఉంది. మనం మనం గాకుండా పోతున్నం. సంబంధాలన్ని నాశనమై పైసచుట్టు తిరుగుతున్నయి. మూలాల్ని మరిసి, ప్రకృతిని మరిసి మనం సానా దూరమచ్చినం. గందుకే అన్నీ పొయ్యినట్టనిపిస్తున్నయి. కనుకనే మనం మూలాల దిక్కు చూసుకుంటున్నాం. ఎనుకకు మర్లి చూసుకుంటున్నం. మన వీవుల్ని మనం చూసుకుంటున్నం. గదిప్పుడవుసరమయింది. ఒక్క ఇక్కన్నే కాదు. బహుశ ప్రపంచమంతట గిట్లనే జరుగుతుందేమొ...? అలెక్స్‌హేలీ తీరుగ తరతరాల వెనుకకు మర్లి మనల్ని మనం యాజ్జేసుకోవాలె...గిండ్ల గింత మతులాబుందెరికేనా...? అన్నడు రాజమల్లు. ❖

వృద్ధ యువతి

(14 పేజీ తరువాయి)

పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయనను అభినందిస్తూ, భారతదేశ పరిస్థితులను తెలియజేస్తూ ఒక కవితరాసి పంపగా కృతజ్ఞతలు తెలియజేస్తూ కలాం సమాధానమిచ్చారు.

రాసిన గీతాలు కొన్ని ప్రచురితం కావడంతో రాసిన వాటిని మనవడి సహాయంతో కంప్యూటర్‌పై కంపోజ్ చేసుకుంటున్నారు. సంగీతంలో ప్రావీణ్యం సంపాదించడానికి ముందు కీబోర్డు నేర్చుకొని తర్వాత వీణ వాయించడంలో శిక్షణ పొందారు. పిల్లల కోసం రకరకాల చిన్న కథలు రాయడంలో కూడా ప్రావీణ్యత సంపాదించారు.

ఆరు పదుల వయస్సు దాటాక అయ్యప్ప కొండకు మూడుసార్లు, జమ్మూలో వైష్ణోదేవి గుడికి ఒకసారి కాలి నడకన వెళ్ళారు.

ఒకసారి కంటికి శస్త్ర చికిత్స జరగడం, తలకు దెబ్బతగిలి జ్ఞాపకశక్తి కోల్పోవడం జరిగినప్పటికీ మళ్ళీ కోలుకుని తన పూర్వపు కార్యక్రమాల్లో నిమగ్నం అయిపోయారు. ఎప్పుడూ ఖాళీగా ఉండకుండా సమయాన్ని వృధా చేయకుండా నిరంతరం పనిలో ఉండటం లక్ష్మీరాఘవన్ ప్రత్యేకత.

* * *

ముంబాయి శివారులో బ్యాంకు కాలనీ.

లక్ష్మీరాఘవన్ ఇచ్చిన అడ్రస్సును పట్టుకుని వెంకట రమణి బయలుదేరింది. తను పని చేసే పత్రికకు లక్ష్మీరాఘవన్ ఇంటర్వ్యూ ప్రచురించాలన్నది ఆమె ఆలోచన.

ఇల్లు కనుక్కుని తలుపు తట్టింది.

చిన్న కుర్రవాడు తలుపు తీసి రమణిని కూర్చోబెట్టి - "నానమ్మా! నీకోసం ఎవరో వచ్చారు!" అని చెప్పాడు.

లక్ష్మీ రాఘవన్ ముందు గదిలోకి వచ్చింది.

ఆమె చేతిలో అల్లుతున్న స్వెట్టర్ ఉంది - 'టైం వేస్టు చేయడం ఇష్టం ఉండదు... రామ్మా!" అంటూ ఎదురుగా సోఫాలో కూర్చుంది.

"మా పత్రిక్కి ముంబాయిలో మంచి సర్క్యులేషన్ ఉంది. చేతి రాతతో బహుమతిపొందిన రోజు మిమ్మల్ని చూసిన తర్వాత మీ వంటి వ్యక్తులను మా పాఠకులకు పరిచయం చేయాలని అనిపించింది...." అంది రమణి.

"నాలో ప్రత్యేకత ఉందని అనుకోవడం లేదు. నాకు ఆసక్తి వున్న రంగాలన్నింటిలోను కృషి చేశాను అంతే..." లక్ష్మీ రాఘవన్ చెప్పింది.

పనిమనిషి రెండు కాఫీ కప్పులను తీసుకువచ్చి చెరొకటి అందించింది.

ఆమె కాఫీ తాగుతుండగా లక్ష్మి తన జీవితంలో ముఖ్య ఘట్టాలన్నింటినీ వివరించింది. ప్రాథమిక స్థాయిలో ఆగిపోయిన చదువును కొనసాగించిన విధానం, సంగీత సాహిత్యాలలో చేసిన కృషి సంఘటనల వారిగా తెలియజేస్తుంటే అవసరమైన విషయాలను రమణి తనతో తెచ్చుకున్న చిన్న పుస్తకంలో నోటు చేసుకుంది.

"మహిళలకు మీ సందేశం ఏమిటి?"

"నేను సందేశం ఇచ్చేటంత ప్రముఖురాల్ని కాదు. అందరిలాంటి సాధారణమైన స్త్రీని, అయితే చాలామంది మహిళలు తమ సమయాన్ని వృధా చేస్తుంటారు. ఏ పనీ లేకుండా ఇరుగుపొరుగు వారితో పిచ్చాపాటి మాటలకు ప్రాధాన్యం ఇస్తారు. ఇద్దరు కలిస్తే తమ మధ్యలేని మూడవ మనిషి గురించి మాట్లాడుకుంటారు. ఇది ఎవరికీ అవసరం లేదు. ఖాళీ సమయాలను సద్వినియోగం చేసుకుంటూ తమని తాము అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడే పురుషులకు ధీటుగా ముందుకు సాగవచ్చు..." అంది.

"అందరికీ మీలాంటి అవకాశాలు రావు కదా?"

అవకాశాలు ఎవరికీ రావు. మనమే వెతుక్కోవాలి. ఎవరి స్థాయిలో వారు కృషి చేయాలి" అంది.

తర్వాత ఇరువురి మధ్యా ఎన్నో విషయాలు చర్చలకు వచ్చాయి. తర్వాత రిపోర్టర్ రమణి సెలవు తీసుకుని బైటికి వచ్చేసింది.

వారం తర్వాత బొల్లాప్రగడ వెంకట రమణి మళ్ళీ లక్ష్మీ రాఘవన్ ఇంటికి వచ్చింది. ఆమె చేతిలో వున్న పత్రికను అందించింది. అందులో లక్ష్మీ రాఘవన్ అభిప్రాయాలు, ఆలోచనలు ఏరికూర్చి వ్యాసంగా ప్రచురించబడి వున్నాయి.

పుస్తకాలు చూసి లక్ష్మి ఎంతో ఆనందించింది.

"ఎంతోమంది గూర్చి కథలు రాశాను. కవిత్వం రాశాను. భక్తిగీతాలు రాశాను. నా గురించి రాసినది మాత్రం ఇదొక్కటే"... అంది.

రమణి దగ్గరికి వచ్చి ఆ వ్యాసం పేరును లక్ష్మీ రాఘవన్‌కి చూపించింది. 'వృద్ధ యువతి' ఆ టైటిల్ చూసి లక్ష్మి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. ❖



సాధారణ చర్మవ్యాధులు

చికిత్స - నివారణ

డా॥ నాగినేని భాస్కరరావు

మానవ దేహానికి ముఖ్యమైన బరువులోనూ, ఘనపరిమాణంలోనూ అతి పెద్ద అవయవం చర్మం. మన శరీర భాగాలకు అత్యుత్తమ (వస్త్రధారణ లాంటి) తొడుగు, బరువు 18 పౌండ్లు, 18 చ.అ. వరకు విస్తరిస్తుంది. లేకసాగుతుంది. చర్మాన్ని శరీరం యొక్క అద్దంగా లేక దర్పణంగా వర్ణించవచ్చు. అది శారీరక, మానసిక మనస్తత్వాలను ప్రతిబింబిస్తుంది. చర్మ సౌందర్య రక్షణ మానవులకు ఎన్నో శతాబ్దాల నుండి వస్తున్న ముఖ్య నాగరికత. చర్మ సౌందర్య రహస్యాలు ఎన్నో వున్నాయి.

'తాము ఎంత నల్లగా వున్నా తమ జీవిత భాగస్వామి ఎర్రగా లేక తెల్లగా వుండాలని ప్రతివారూ కోరుకుంటారు.' 'నీ మేలు మర్చిపోలేను. నా చర్మం వలిచి చెప్పులు కుట్టిస్తా', 'మాట వినకపోతే తోలు తీస్తా!' 'మానవ శరీరంలో ఏముంది? అదొక నవరంధ్రాలు కలిగిన తోలుతిత్తి' ఇలా ఎన్నో మాటల్ని మనం చర్మం గురించి వింటాం. మన చర్మాన్ని మనం రక్షించుకుని ఆరోగ్యంగా ఎలా వుంచుకోవాలో, సాధారణంగా వచ్చే చర్మవ్యాధులు వాటి నివారణ, చికిత్స మొదలగు విషయాలను ఈ వ్యాసంలో స్థూలంగా చర్చిద్దాం.

చర్మరోగాలు : ఒక లాభాన్ని కలిగి వున్నాయి. అదేమంటే అవి వైద్యునికి చక్కగా కనిపిస్తాయి. పైపూత మందుతో చికిత్స చేసేందుకు అనువుగా వుంటాయి. కాని చర్మ రోగాల అసౌకర్యం ఏమంటే అవి రోగికి కన్పించటమే కాక ఇతరులకూ కన్పిస్తాయి. అయితే చర్మరోగాల వల్ల మరణం సంభవించకపోయినా వాటివల్ల ఎక్కువగా అనారోగ్య స్థితికి చేరుకునే అవకాశం వుంది. సంఘంలో తిరిగేందుకు న్యూనతా భావాన్ని కలిగిస్తాయి. దీనివల్ల మానసిక ఒత్తిడి, మానసిక గాయాలకు దారితీసి రోగులు వాటిని భరించలేని స్థితిలో వుంటారు. ఉదా.॥ కుష్టువ్యాధి, ఎగ్జిమా, సుఖవ్యాధులు.

స్కాబీస్ (దురద లేక గజ్జి)

శార్‌కోప్టెస్ స్కాబయై అను పరాన్న జీవి మన శరీరంపై నివసిస్తూ కొన్ని హానికరమైన పదార్థాలను విడుదల చేయడం వల్ల స్కాబీస్ లేక గజ్జి కలుగుతుంది. ఇది పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. వాళ్ళ వల్ల పెద్దలకూ వస్తుంది. జనసమ్మర్థం ఎక్కువగా వున్నచోట ఇది వ్యాప్తి చెందుతుంది.

లక్షణం : స్కాబీస్ పరాన్న జీవి విడుదల చేసే పదార్థం దురద పుట్టిస్తుంది. చేతివేళ్ళ సందుల్లో చీముపట్టిన పుండ్లు వుంటాయి. ఆ పుండ్లు ఇంకా మణికట్టు వద్ద, చంకల్లో, జన(నేంద్రియాల)నాంగాల వద్ద, తొడల పైనా, పిర్రల పైనా వుంటాయి. ఒక్కోసారి మందులు వాడినా దురద వుంటుంది.

జీవచక్రం : ఈ స్కాబీస్ వ్యాప్తి చెందుటకు ఫలదీకరణం చెందిన ఆడ పరాన్న జీవి అవసేరం. వాటి సైజు 300 మైక్రోన్స్. అది వేళ్ళ సందుల్లో నెర్రెలు చేసి అందులో గ్రుడ్లు పెడుతుంది. అవి పెద్దవగుటకు 10-14 రోజులు పడుతుంది.

చికిత్స : ఇంట్లో అందరికీ వైద్యం చేయాలి. 1శాతం గామా బెంజీను హెగ్‌సాక్లోరైడు పూతమందును మెడనుండి పాదాల వరకు శరీరంపై పూసుకోవాలి. 10 రోజుల తరువాత మరొక పూత పూయాలి. 5శాతం



పెర్‌మెథ్రిన్ పూతమందు కూడా బాగా పని చేస్తుంది. బట్టలను, పడక దుస్తులను మరగబెట్టిన నీళ్ళలో వుడికించి, ఆరబెట్టి పెట్టె బాగా వేడిగా వున్న సమయంలో ఆ బట్టల్ని ఇస్త్రీ చేసి వేసుకోవాలి.

విషమ పరిస్థితులు : స్కాబీసును నయం చేసుకోనట్లయితే ఈ కింది విషమ పరిస్థితులకు దారితీస్తుంది. (1) బాక్టీరియా సోకి వ్యాధిపడుట 2. గజ్జి సోకిన భాగాలు ఎర్రబడి, వాచిపోయి, నీరు చేరి రక్తంతో కూడిన రసిని స్రవిస్తూ చెక్కులు కట్టుట 3. శిశ్నపు చర్మం వాచుట దురద పుట్టిగీకినపుడు వాచిపోయిన శిశ్నపు ముందు చర్మమును వెనక్కు తీసుకుపోలేని స్థితి. ఇదిపిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

పేలు పడుట (పెడిక్యులోసిస్)

మన శరీరపు ఉపరితలంపై జీవిస్తూ మన రక్తాన్ని తాగుతూ ఉపద్రవం, దురద కలిగించే పేలు మూడు రకాలు ఎ) పెడిక్యులస్ కాపిటిస్ - తలలోనూ, బి) పెడిక్యులస్ కార్పొరేరిస్ - శరీరంపైన, సి) పెడిక్యులస్ ప్యూబిస్ - జననాంగముల వద్ద నున్న వెంట్రుకల్లో నివసిస్తూ దురదను కలిగించి చికాకు పుట్టిస్తాయి. ఈ పేలు

అతిథి శరీరంలోని రక్తాన్ని పీల్చి జీవిస్తాయి. అతిథి లేకుండా అవి జీవించలేవు. శరీరంపై వుండే పేల వల్ల జ్వరం, టైఫస్, మెదడువాపు వస్తాయి.

తలలో పేలు పడటం :

ఒకే మంచంలో పడుకోవడం వల్లగాని, పిల్లలు కలిసి ఆడుకునేటప్పుడు గాని తలలోని పేలు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. పిల్లల్లో ముఖ్యంగా ఆడవాళ్ళల్లో పేలు ఎక్కువగా పడతాయి. ఒకచోట ఎక్కువమంది నివసిస్తే త్వరగా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తాయి. తల సరిగ్గా దువ్వుకోకపోవడం, తలస్నానం చేయకపోవడం వల్లనూ తలలో పేలు పడతాయి. ఈ పేలు తలలో గుడ్లు (ఈపి) పెడతాయి.

పేలు పడడం వల్ల తల (నెత్తి) దురదగా వుంటుంది. దురద బాగా వుండి గీరటం వల్ల చిన్న చిన్న గడ్డలు నెత్తిమీద పుడతాయి. మెడ పక్కన లింఫ్ గ్రంథులు వాచిపోతాయి. తలలో పేల గుడ్లు కన్పిస్తాయి.

చికిత్స : తలలో పేలు పడ్డ వారితో పాటు ఇంట్లో మిగతా వారికి కూడా చికిత్స చేయాలి. తలకు 1 శాతం గామా బెంజీను హెగ్జాక్లోరైడు పూతమందుగాని లేక 1 శాతం పెరిమెథ్రిన్ పూతమందుగాని రాసుకున్నట్లయితే నయమవుతుంది. ఇంకా క్రిములను చంపే గుణాలు కలిగిన షాంపూలతో తలస్నానం చేయాలి.



శరీరంపై పేలు పడటం :

శరీరంపై పేలు అతిథి రక్తాన్ని పీల్చి జీవిస్తాయి. వాటివల్ల పుండ్లు పడతాయి. దురద వస్తుంది. అయితే ఇవి రోగి శరీరంపై కాక రోగి యొక్క దుస్తుల్లో నివసిస్తాయి. ఇటువంటి వారు బట్టలు ఉతుక్కోవడానికి స్థోమత, అవకాశం లేని మగవారై వుంటారు. ఇల్లు లేక తిరుగుతూ వుంటారు. కనుక ఈ వ్యాధికి సంచారి లేక బికారి వ్యాధి అని పేరు. వీరి దుస్తులపై పేలుంటాయి.

చికిత్స : సలసల మరిగే నీటిలో రోగి దుస్తులను, ఇతర బట్టలను ఉడికించి, బాగా ఉతికి, ఆరబెట్టి బాగా వేడితో వున్న ఇస్త్రీ పెట్టెతో ఇస్త్రీ చేయించాలి. 10 శాతం డి.డి.టి. పొడరుగాని, 1 శాతం గామా బెంజీను హెగ్జాక్లోరైడు పొడరునుగాని దుస్తుల్లోనూ, పడక బట్టలపైనా వేయాలి. శరీరాన్ని, దుస్తులను శుభ్రంగా వుంచుకోవాలి.

కటి ప్రదేశంలో పేలు పడటం :

కటి ప్రదేశంలో వుండే పేలు లైంగిక సంపర్కం ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తాయి. దీని ఆకారం ఎండ్రకాయను పోలి వుంటుంది. కనుక ఎండ్రకాయ పేను అని అంటారు. కటి ప్రదేశంలో పేలుపడ్డ వారికి కటి ప్రదేశంలో, తొడలోపలి భాగాలు, జననాంగముల వద్ద, జననాంగమునకు గుదమునకు మధ్య భాగంలో ఇంకా వెంట్రుకలున్న ఆ ప్రాంతంలో తీవ్రమైన దురద వుంటుంది. ఒక చేతి దర్పణంతో ఈ పేలను చూడవచ్చు. ఇవి వెంట్రుక కుదళ్ళ ముఖద్వారంలోకి చొచ్చుకొని పోయి వుంటాయి. గుడ్లు కూడా వెంట్రుకలకు అతుక్కుని వుంటాయి.

చికిత్స : 1 శాతం ఆమా బెంజీను హెగ్జాక్లోరైడు పూతమందునుగాని లేక 1 శాతం పెరిమిథ్రిన్ పూతమందునుగాని ఒక్కసారి ఆయా భాగాల వద్ద పూసుకుంటే నయమవుతుంది. లైంగిక సంపర్కం జరిపే భాగస్వాములిద్దరికీ చికిత్స ఇవ్వాలి.

ఇక్తీమా

చర్మపు లోపలి పొర డెర్మిస్‌కు బాక్టీరియా వల్ల వ్యాధి రావటాన్ని 'ఇక్తీమా' అంటారు. పై చర్మంలో చీము పట్టిన పుండ్లకు భిన్నంగా 'ఇక్తీమా' పుండు డెర్మిస్



శిధిలమవటం వల్ల మానిపోయాక మచ్చపడుతుంది. యుక్తవయస్సులో వున్న వారు, పెద్ద పిల్లలు ముఖ్యంగా అపరిశుభ్రంగా వున్న వారికి 'ఇక్తీమా' పుండ్లు ఏర్పడతాయి. సిరద్వారా మత్తు పదార్థాలను పుచ్చుకునే వారు, సారాయి తాగేవారు, బలహీనంగా వున్న వారు ముఖ్యంగా మగవారిలో ఈ పుండ్లు వస్తాయి. కాళ్ళమీద ఎక్కువగా వస్తాయి. బీటాహీమోలైటిక్ స్ట్రెప్టోకోకయి అను బాక్టీరియా వల్ల ఇక్తీమా కలుగుతుంది.

చికిత్స : ఎ) నోటి ద్వారా రొక్సిత్రోమైసిన్ మాత్రలు పూటకు 150 మి.గ్రా. ఒకటి చొప్పున రెండు పూటలే ఒకటి లేక రెండు వారాలు. బి) యాంటీబయాటిక్ పూతమందు.

నివారణ : చర్మమును ఎప్పుడూ పరిశుభ్రంగా వుంచుకోవాలి. మత్తు పదార్థాల జోలికి పోరాదు.

వెంట్రుక కుదురు పుండు

స్టెఫలోకోకయి బాక్టీరియా వల్ల వెంట్రుక కుదురు వాపు వస్తుంది. చీము కూడా పడుతుంది. వ్యాధి సోకిన (వాడి శుభ్రం చేయని) బ్లేడ్లు వాడి వెంట్రుకలు తీసుకోవడం వల్లనూ, ఉత్తర భారతంలో ఒక సనాతన అలవాటు 'శరీరానికి నూనె పట్టించటం' వల్లనూ వెంట్రుక(ల) కుదురు వాపు వస్తుంది. ఇది రెండు రకాలు ఎ) పై చర్మపు పొరలో బి) కింది చర్మపు పొరలో (లోతుగా) వస్తుంది. యుక్త వయస్సులోనూ మధ్య వయస్కుల్లోనూ ఇది వస్తుంది. మగవారిలో గడ్డం, మీసాలు ప్రాంతంలో, స్త్రీ, పురుషుల్లో కాళ్ళ ముందరి భాగంలో వస్తాయి. చంకల్లో, గజ్జల్లో, కటి ప్రదేశంలో, నెత్తిమీద కూడా ఈ వెంట్రుక కుదురు వాపు వస్తుంది.

చికిత్స : ఎ) నోటిద్వారా రోక్సీత్రోమైసిన్ 150 మి.గ్రా. మాత్రలు. పూటకు ఒకటి చొప్పున రెండు పూటలు ఒక వారం. బి) యాంటీబయాటిక్ పూతమందు.

(మిగతా వచ్చేవారం)

పుస్తక పరిచయం

ఒక మాయా ప్రపంచం కథ

ఈ రోజు యువతరానికి ఆదర్శం అమెరికా. పిల్లాడ్ని కన్నప్పటి నుంచి తల్లిదండ్రులు కూడా పిల్లవాడు ఎప్పుడు చదివి ప్రయోజకుడై అమెరికాకు వెళ్ళి డాలర్లు పంపిస్తాడా అని ఎదురు చూడటం. అమెరికా గురించి ఆలోచించడం, అమెరికా గురించి కలలు కనడమే యువతరానికి పరమావధిగా మారిపోయింది. అమెరికా వెళ్ళడానికై రకరకాల ప్రణాళికలు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ చేసి ఉద్యోగం సంపాదించుకొని అక్కడే సెటిలైపోవాలని ఆలోచించే వాళ్ళు ఎక్కువగా కనిపిస్తారు. లేదా ఇక్కడ చదివి అక్కడ ఉద్యోగాలకు వెళ్ళి స్థిరపడేవాళ్ళు మరికొందరు. ఇక్కడున్న తెలుగు వాళ్ళు తమ పిల్లల్ని పంపి అక్కడి తమ బంధువుల సహాయంతో ఏదో రకంగా అక్కడ ఉద్యోగం, పౌరసత్వంపై ప్రయత్నించేవాళ్ళు మరికొందరు. అమెరికా వెళ్ళి అక్కడ సెటిలవ్వాలనే ప్రణాళిక మరికొందరిది. ఇలా రకరకాల ఐడియాలతో అక్కడకు వెళ్ళిన తమ ప్రతిభ, కష్టించి పనిచేయడం ద్వారా బాగానే అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు. ప్రతిభ వున్న వాడిని అక్కడి వాళ్ళు తప్పనిసరిగా పైకెదగడానికి ప్రోత్సహిస్తారు. డబ్బు ఎక్కువ సంపాదించుకోవాలనుకునే వాళ్ళు రీసెర్చిని వదిలిపెట్టి ఏదైనా ప్రైవేటు కంపెనీలలో భారీ జీతాలకు కుదురుకుంటారు. టీచింగ్-రీసెర్చ్ పట్ల ఆసక్తి వున్న వాళ్ళు అకడమిక్‌గా స్థిరపడటానికి ప్రయత్నిస్తారు. మొదట ఇండియా నుండి అమెరికా వెళ్ళిన వారు అక్కడ మన తెలుగువాళ్ళ ప్రవర్తన చూసి ఆశ్చర్యపోతారు. అక్కడ సెటిలైన వారిలో కొందరు అచ్చు అమెరికన్లలా ప్రవర్తిస్తుంటారు. చాలామంది తమ వైభవాన్ని ప్రదర్శించడానికి స్వదేశీ యాత్రలు చేస్తుంటారు. ఇక్కడి నుండి అమెరికాను తలచుకుంటే భూతల స్వర్గంలా వుంటుంది. అదే అమెరికా నుండి ఇండియాను తలచుకుంటే అంతా మాసిపోయి కుళ్ళిపోయినట్లు కనబడుతుంది. కొందరు ప్రముఖులకు, అక్కడ స్థిరపడిన తెలుగువారు కూడా కులాల వారీగా సభలు, కార్యక్రమాలు చేపట్టి తెలుగుజాతిని ఉద్ధరించడానికి తహతహలాడిపోతారు.

ఇక నిన్నటితరం వాళ్ళకు ఒక కాలు ఇండియాలో, ఒక కాలు అమెరికాలో వుంటుంది. వాళ్ళు అక్కడ డాలర్లు సంపాదిస్తున్నా భారతీయతా-భారత సంస్కృతి మీద అపారమైన ప్రేమను కనబరుస్తారు. కాని వార్ని పిల్లలు అక్కడి అమెరికా సమాజంలో పెరగడం వల్ల స్వేచ్ఛా ప్రవృత్తిని అలవర్చుకుంటారు. అమెరికాలో వుంటూ అమెరికా డబ్బు కావాలి, వాళ్ళ సంస్కృతి వద్దనుకుంటే ఎలా కుదురుతుంది. దీనివల్ల తరాల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇండియాలో వ్యక్తిత్వాలు మరిచి మిడిమిడి కల్చరులో పడి విడాకులిచ్చుకున్న భారతీయ కుటుంబాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

తమను ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులకు మునలితనంలో ఆసరాగా



అనంతం
రచన : డా॥ తేతలి ఆనంద ప్రసాదరావు
వెల : రు. 120/-,
పేజీలు : 331
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఉండాల్సిందిపోయి డబ్బుపంపి చేతులు కడిగేసుకుంటున్నారు. వాళ్ళు ఇండియాకొచ్చి ఉండలేరు. పెద్దవాళ్ళను అమెరికాకు తీసుకుపోలేరు. ఈ గిల్టీ ఫీలింగు ఒకవైపు తొలిచేస్తున్న వాళ్ళ అవసరాలు, ప్రయోజనాలే విధానాలను నిర్ణయిస్తారు. స్వార్థం, అవకాశవాదం, కన్స్యూమరిజం, ఎగ్జిబిషన్ వాళ్ళ ప్రవర్తనల్లో మార్పులు తెస్తాయి. ఇలా అమెరికాలో స్థిరపడిన భారతీయుల జీవన విధానాన్ని చిత్రీకరిస్తూ వచ్చిన నవలే "అనంతం".

అమెరికా జీవన విధానానికి అడ్జస్టుకాలేక స్వదేశానికి చేరుకున్న 'అనంతం' కథ ఇది. అనంతం అంటే ఆత్మకథ అనే ధ్వని స్ఫురించినా, ఇది ప్రధానంగా అనంతం అనే వ్యక్తి యొక్క జీవిత చరిత్రే ఇది. మన సంస్కృతి సంప్రదాయాలు, లలిత కళల పట్ల ఆసక్తి కలిగిన అనంతం లాంటి సెంటిమెంటల్ వ్యక్తి ఎలాంటి అనుబంధాలు లేకుండా స్వసుఖానికే ప్రాధాన్యతనిచ్చే అక్కడి జీవితవిధానానికి తట్టుకోలేకపోతాడు. ఇక్కడ ఇండియాలో అనంతం తల్లిదండ్రుల ఆత్మాభిమానం, అక్కడ అనంతం నిస్సహాయత మన మనసును కదిలిస్తాయి. చివరకు తన మూలాల్ని వెతుక్కుంటూ స్వదేశానికి వచ్చేసిన అనంతం కథ ఇది. "ఇది ఒక మాయా ప్రపంచం, ఎవ్వరికీ నమ్మశక్యం కాని ప్రపంచం. ఇది ఒక వ్యాపారంతో కూడిన ప్రపంచం" అని అమెరికా జీవితాన్ని సరిగ్గా గుర్తించిన రాంబాబు ఉపకథ అనంతం స్నేహితుడిగా కొనసాగుతుంది. అమెరికాలో పైకెదగడానికి అవకాశాలున్నాయని రాంబాబును పెళ్ళి చేసుకున్న లత కెరీరిజం నచ్చక తిరిగి రాంబాబు ఇండియాకు వచ్చి ఐటిలో సెటిలవుతాడు. తల్లిదండ్రులతో వాళ్ళకున్న అనుబంధాలు, డబ్బు సంపాదించాలన్న యావ లేకపోవడం, ఏదో రకంగా సమాజానికి ఉపయోగపడాలనే తాపత్రయం వల్ల అక్కడి అమెరికన్ సమాజంలో ఇమడలేక స్వదేశం చేరుకున్న వారి అనుభవాలకు ప్రతిరూపమే "అనంతం" నవల. డా॥ తేతలి ఆనంద ప్రసాదరావుగారి మొదటి నవల ఇది అంటే నమ్మశక్యం కాని రీతిలో ఈ నవల ఆద్యంతం హాయిగా, ఆసక్తిగా చదవింప చేస్తుంది. తప్పకుండా చదవాల్సిన నవల్లో ఇదొకటి.

- కె.పి.అశోక్ కుమార్

స్వీకారం

ప్రేమ అంటే ఏమిటి ?
రచన : బి.ఎస్.రాములు
వెల : రు. 20/-,
ప్రతులకు : యూనివర్సిటీ ఆఫ్ సోషల్ ఫిలాసఫీ, విశాల సాహిత్య అకాడమి, 2-2-186/53/5, రామకృష్ణనగర్, బాగ్‌అంబర్‌పేట, హైదరాబాద్.

బైబిల్ బాగోతం
(కొత్త దృష్టిలో కొత్త నిబంధన)
రచన : కోనా వీరబ్రహ్మం
వెల : రు. 20/-,
ప్రతులకు : మైత్రిబుక్ హౌస్, మసీద్ లైన్, అరండల్ పేట్, ఏలూరు రోడ్, విజయవాడ-2.



హెచ్. రమేష్‌బాబు.

నయనమనోహరం నైనిటాల్ నగరం



కనుచూపుమేర ఎటుచూసినా పచ్చని చెట్లు పరుచుకున్న దృశ్యాలు. హిమగిరులు, శిఖరాలు, లోయలూ, లెక్కలేనన్ని సరస్సులు వెరసి నైనిటాల్ నగరం. ఉత్తరాంచల్‌లో వున్న నైనిటాల్ నగరం చుట్టూరా సరస్సులే. అసలు ఈ నగరమే ఓ సరస్సు తీరాన వెలిసింది.

నైనీదేవి పేర ఈ నగరం నిర్మితమైంది. ఈ నైనీదేవిపై ఓ పురాణకథ ప్రచారంలో ఉంది. దక్షుడి అవమానంతో ఆత్మాహుతి చేసుకున్న సతీదేవి సగం కాలిన దశలో ఆమె శరీరాన్ని కైలాసానికి తీసుకువచ్చి భీకర ప్రళయ తాండవం చేస్తాడు శివుడు. ఆ తాండవానికి ముల్లోకాలు తలకిందులైపోతాయి. దాంతో సతీదేవి శరీరం నుండి ఎడమ కన్ను విడి ఈ ప్రాంతంలో పడింది. ఈ కంటి నుండి ఉద్భవించిన నీరే ఇక్కడ కన్ను ఆకారంలో సరస్సుగా ఏర్పడిందే నైనిటాల్. 'నైనీ' అంటే కన్ను, 'తాల్' అంటే సరస్సు. క్రమంగా నైనిటాల్‌గా మారింది. ఈ నైనీ సరస్సు తీరాన్నే నైనిటాల్ నగరం ఉంది. సముద్ర మట్టానికి 1939 మీటర్ల ఎత్తున ఉన్న నైనిటాల్ నగరం హిమాలయాల్లో ఉంది.

దేశ రాజధాని ఢిల్లీకి 325 కిలోమీటర్ల దూరంలో ఉన్న నైనిటాల్‌కి సమీపంలోని కాట్గోదామ్ రైల్వేస్టేషన్ ఉంది. ఢిల్లీ నుండి రైలు మార్గంతో బాటు, బస్సు సౌకర్యం ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్ నుండి కొన్ని పట్టణాల నుండి కూడా బస్సులు వస్తుంటాయి. కాట్గోదామ్ నుండి నైనిటాల్ వైపు బస్సులో సుమారు 40 కిలోమీటర్ల పొడవునా ఘాట్‌రోడ్డు ప్రయాణం ప్రకృతి సౌందర్యం నడుమ ఆహ్లాదరకంగా సాగుతుంది. ఈ ప్రయాణం లోయలూ గుట్టల గుండా సందర్శకులను అత్యంత ఉద్వేగానికి గురిచేస్తుంది.





నైనిటాల్ నగరం చుట్టూ ఏడు పర్వతశిఖరాలు ఉన్నాయి. సప్తశిఖరాలుగా వాటిని పిలుస్తారు. వాటిపేర్లు వరుసగా నైనా శిఖరం, ఆల్మా శిఖరం, స్నోవ్యూ శిఖరం, లరియాకంట, దేవ్‌పట్ట, టీఫన్ టాప్, డరోతీ సీట్. వీటిలో నైనా శిఖరం ఎత్తయినది. ఈ శిఖరాలపై నుండి హిమాలయ పర్వతశ్రేణుల సౌందర్యాన్ని చూడవచ్చు. ఇక్కడి నుండి నైనిటాల్ నగర సౌందర్యం నయన మనోహరంగా గోచరిస్తుంది.

ఈ నైనిటాల్ నగరాన్ని పూర్వం ఖాసదేశమని పిలిచేవారు. క్రీ.పూ. 10 వ శతాబ్ద కాలంలో కటూరియా వంశస్థుల పాలనలో ఉండేది. అనంతరం చంద్‌వంశ రాజులు, గూర్ఖాలు కొంతకాలం పాలించారు. 1857 తరువాత బ్రిటిష్‌వారి పాలనలోకి వచ్చింది. పురాణ కాలంలో ఈ ప్రాంతం అత్రి, పౌలన్య, ప్రలాన మునుల తపోస్థలంగా ఉండేదని ఇక్కడి వారి విశ్వాసం.

నైనిటాల్ చుట్టూ పలు సందర్శనీయ స్థలాలున్నవి. సప్త శిఖరాల్లో ఒకటైన టీఫన్‌టాప్ దగ్గర్లో డోర్తీసీట్ అనే స్మారక మందిరం ఉంది. దాన్ని 'డోర్తీకెల్లర్' అనే చిత్రకారిణి స్మృతితో నిర్మించారు. స్నోవ్యూ శిఖరం వద్ద గల రోప్‌వే పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. నైనిటాల్ చుట్టూ విస్తరించి వున్న అతి పెద్ద సరస్సు 'భీమ్‌తాల్'. నీలిరంగు నీళ్ళతో నిగనిగలాడే ఈ సరస్సు దగ్గర్లో భీమేశ్వరుడి ఆలయం ఉంది. ఈ సరస్సుల్లో బోటిషికారు చేస్తారు. మరో ఏడు సరస్సులు అల్లుకున్న ప్రాంతం సత్‌తాల్. దమయంతి, పన్నా, రామ, సీత, హనుమ సరోవరాలు ఇందులో కలిశాయి. దీనిదగ్గర 'హిడింబి' ఆలయం ఉంది. నైనిటాల్ నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో విభిన్న రీతిలో తొమ్మిది కోణాల్లో విస్తరించిన 'నౌకుచితాల్' సరస్సు ఉంది. దీనికి మరోపేరు 'సనత్ కుమాల్' సరస్సు.

ఇంకా ఈ నైనిటాల్ చుట్టు పక్కల ఖర్పాతాల్ సరస్సు, ఖైంచీలో 'నీమ్‌కరోలీ బాబా' స్మారక మందిరం, 'కిల్‌బురి' పక్షి సంరక్షణ కేంద్రం, కౌసానీ హిల్‌స్టేషన్, 'కార్బెట్ నేషనల్ పార్క్', 200 దేవాలయాల సముదాయం గల 'జాగేశ్వర్', సుందర సూర్యాస్తమయ దృశ్యం కనిపించే 'హనుమాన్‌గారీ' పాంతాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఈ నైనిటాల్ నగరాన్ని మార్చి నుండి జూన్, సెప్టెంబర్ నుండి నవంబర్ నెలలో పర్యాటకులు సందర్శించేందుకు వాతావరణం అనువుగా వుంటుంది. అద్భుతమైన అందాలతో నయనమనోహరంగా కనువిందు చేసే నైనిటాల్ నగర సందర్శనం ఓ గొప్ప అనుభూతి. ❖

మదిలో అద్భుతమైన ఊహాచిత్రం తటుక్కున మెదిలి మాయమవ్వచ్చు. అటువంటి అద్భుతమైన, అపురూపమైన చిత్రాన్ని కాగితం మీద పెట్టగలగాలంటే ఆ వ్యక్తి కవి అయినా అయ్యి వుండాలి. లేదా చక్కని రూపాన్ని చిత్రీకరించగలిగే చిత్రకారుడైనా అయివుండాలి. ఎందుకంటే ఆ ఊహకు అద్భుతంగా కళ్లకు కట్టినట్లు వర్ణించి చెప్పగలిగే గుణం కవికుంటుంది. అయితే కవికంటే చిత్రకారుడికి ఆ ఊహను మరింత వర్ణ, రేఖా చిత్రాలుగా కన్పించని భావాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో అద్భుత రూపాన్ని కాన్వాసుపై సాక్షాత్కరింప చేసే నైపుణ్యం, సృజనాత్మకశక్తి ఒక చిత్రకారుడికే వుంటుంది. అటువంటి మన ఊహకందని చిత్రాలను చిత్రించి, మనం చూడలేని ఊహలను సైతం అద్భుత రీతిలో తన త్రినేత్రమనే భావపరిమతో చక్కని రూపాలుగా చిత్రించే కళాకారుడు **అల్లు రాంబాబు**. మూడుపదుల పై చిలుకు వయస్సులోనే సృజనాత్మక చిత్రకారుడిగా, రచయితగా, నటుడిగా, మేకప్ ఆర్టిస్టుగా, రంగస్థలాంకరణ కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞను రాంబాబు ప్రదర్శిస్తున్నారు.



చలపాక ప్రకాష్

సృజనాత్మకతను ప్రదర్శించే చిత్రకారుడు

1970 జులై 1న తూర్పుగోదావరి జిల్లా తుని మండలం, చేవూరులో శ్రీమతి మహాలక్ష్మి, శ్రీ సూర్యారావు దంపతులకు జన్మించిన రాంబాబు, బి.ఏ., టి.టి.సి. వరకు చదివారు. ఫైన్ ఆర్ట్స్‌లో డ్రాయింగ్ హయ్యర్‌గ్రేడ్ చేసి ప్రస్తుతం విజయవాడలోని ఎన్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయిల్ పెయింటింగ్‌లో చిత్రాలను చిత్రించటమంటే ఇష్టపడే రాంబాబు, తన అభిమాన చిత్రకారుడు రాజారవివర్మ అని చెప్తారు. శృంగార, భక్తి ప్రధాన చిత్రాలను చిత్రించటంలో అందవేసిన చెయ్యిగా విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న రాంబాబు, శకుంతల జాబు తదితర రీమేక్ చిత్రాలను చిత్రించి చూపరులను అబ్బురపరిచారు. నయనానందకరమై ఆ చిత్రాలలోని రూపాలకు ప్రాణప్రతిష్ట జరిగిందా అని భ్రమను కలిగించే తైలవర్ణ చిత్రాలు వేశారు. మనల్ని మరో లోకంలో విహరింప చేసేలా తనదైన శైలిని ఏర్పరచుకున్నారు రాంబాబు. శ్రీ వినాయకుడు, సరస్వతి, లక్ష్మిదేవి, పార్వతిదేవి, విష్ణుమూర్తి, గాయత్రిదేవి, శివుడు తదితర దేవతల నిలువెత్తు చిత్రాలు వివిధ పాఠశాలల యాజమాన్యాల కోరికపై వేసిచ్చి వారిని

అర్తుడు ఒకడే

పోలీసు లారీ విరిగి
అడ్డిన చేతులు కీళ్ళు తప్పాయి
మాడు బద్దలై
కణతలు రక్తం స్రవించాయి
క్షతగాత్రుడి ఉచ్ఛ్వాస నిశ్వాసలు
సముద్ర ఘోషను మించాయి
ఆహుతైన వాడు
అత్యంత దీనుడు -
మోహరించిన ఆశ్వికదళం
ప్రభుత్వ పరాక్రమ పటిమ చాటింది
మెరుపుదాడి పదఘట్టనల కింద
పరుగెత్తే ప్రాణం చిక్కింది
చిట్లిన వొళ్ళు
చితికిన పేగులు
విగతజీవుడు నిర్ధనుడు -

ఎక్కుపెట్టిన తుపాకి
ఇష్టారాజ్యంగా పేలి
ఎదురొచ్చిన గుండెను చీల్చింది
ఊపిరి గాలిలో కలిసి
కట్టె నేలపై నిద్రించింది
వికటించిన అధికారం
ప్రకటించిన దర్పమై చాటి
మరణించిన వాడు దుర్బలుడు -
పేపరుపై పొద్దు పొడిచిన
ఒకానొక ఆర్డినెన్స్
ధనాఢ్యుడి కొమ్ముగాచి
ధనహీనుడి రొమ్ము విరిచింది -
ముగింపులోనూ
సశేషంలోనూ
నాటి నేటి కథల్లో
బలహీనుడే
ఆహుతి
హారతి -

- అడిగోపుల వెంకటరత్నమ్

అబ్బురపరిచారు. వారి సన్మానాలను కూడా పొందారు. వేదమంత్రాలు భగవద్గీతలోని శ్లోకాల అర్థాలు వివరించే వివిధ చిత్రపటాలు భారీ సైజులో వేశారు. వివిధ సంస్థలు ఏర్పరచిన చిత్ర కళా ప్రదర్శనలలో ప్రదర్శించి కళారాధకులను మైమరిపించే విధంగా తృప్తిపరిచారు. ఎందరో ప్రశంసలను పొందటం రాంబాబులో సృజనాత్మకతకు నిదర్శనం. అలాగే కొన్ని సంస్థలు నిర్వహించిన సభలలో ఒక వ్యక్తిని కూర్చోబెట్టి క్షణంలో ఆ వ్యక్తి రూపు రేఖా చిత్రాలను అచ్చుగుద్దినట్లు చిత్రించి ఆశ్చర్యపర్చటం రాంబాబులోని ప్రత్యేక ప్రతిభగా అందర్ని ఆకర్షిస్తోంది. రాంబాబు, దేశ, అంతర్జాతీయ క్రైస్తవ మత సేవా సంస్థల స్థాపకులు, నేతల జీవిత చరిత్రలు తెలిపే నిలువెత్తు సుందర రూపాలు దేశ విదేశాలకు పంపి అంతర్జాతీయ చిత్రకారుడిగా గుర్తింపు అందుకోవడం చెప్పుకోదగ్గ విశేషం. లలిత కళా అకాడమీ వారు ఎక్స్‌ప్రెషన్స్ పేరు మీద హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనలో వివిధ భారతీయ ఆరాధనా పద్ధతులను ప్రస్ఫుటించే పెయింట్స్‌లో పాల్గొని చక్కని ప్రశంసలు అందుకున్నారు.

అంతేకాకుండా వివిధ పట్టణాలలోని పలు విద్యా సంస్థలకు శాశ్వత ప్రాతిపదికన రంగస్థలాలంకరణలో వివిధ హంగులు ఏర్పరచడంలో ఎప్పుడు బిజీగా వుంటారు. క్రాఫ్ట్ వర్క్‌లో కూడా ప్రత్యేకతను కలిగి వుంటడటం మరో విశేషం. వెదురు, కాగితం ఉపయోగించి వివిధ ఉత్సవాల కోసం పులి, జింక, అనకొండ, ఏనుగులు, ఎద్దులు, మొసలి, తాబేలు, హంస, నెమలి, కాళికామాత, సంగీత పరికరాలు అత్యంత భారీ సైజులో తయారుచేసి చూపరులను ఆశ్చర్యపరిచారు. జానపద నృత్యం, మైమ్‌లలో కూడా ప్రవేశం వుంది. వివిధ నగరాలలో ప్రదర్శించటంతో పాటు ఎన్నో బహుమతులు, ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల విద్యార్థుల కొరకు వివిధ సామాజిక అంశాలపై చిన్న చిన్న నాటికలు రచించి, స్వీయ దర్శకత్వంలో ప్రదర్శింప చేసి బహుమతులూ సాధించారు. చిత్రకారుడిగా, కళాకారుడిగా ఎన్నో సంస్థల ద్వారా బహుమతులు, సన్మానాలను పొందిన రాంబాబు,

పది నిమిషాలలో రాంబాబు గీసిన వ్యాసకర్త చిత్రం

సాంస్కృతిక విభాగం లలిత కళా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గుంటూరుకు అధ్యక్షులుగాను, విజయవాడ క్రియేటివ్ ఆర్ట్ అకాడమీలో క్రియాశీలక సభ్యత్వం కలిగి వున్నారు. చిత్రకళారంగానికి తనవంతు సేవనూ, బాధ్యతను నిర్వర్తిస్తున్నారు.

దేశంలోని మారుమూల ప్రాంతాలలో కూడా చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రజలకు చిత్రకళయందు ఆసక్తిని పెంపొందింపజేయటమే తన ఆశయమంటారు రాంబాబు. ప్రతిభ గల పేద చిత్రకళాకారులకు, విద్యార్థులకు తన చేయూత నందించటానికి ముందుంటానని చెప్పటం ఆయనలోని సేవాభావానికి తార్కాణం.

మీ ఆర్థిక ఎదుగుదలకు ఈ 'చిత్రకళ' ఎంతవరకు దోహదపడుతుందని ప్రశ్నించినప్పుడు 10 అడుగుల వెడల్పు, 56 అడుగుల పొడవు గల పెద్ద కాన్వాస్‌పై గీసిన 'శకుంతల చిత్రం' అమెరికాలో ఒక సంపన్న ప్రవాసాంధ్రురాలైన కళారాధకురాలు ముచ్చటపడి కొన్నారని, ఆ స్ఫూర్తితోనే మరిన్ని చిత్రాలను యు.ఎస్. పంపాలనే ప్రయత్నంలో వున్నాన్నారు. మనవారికి కళల మీద ఆపేక్ష తక్కువని అదే విదేశాలలోనైతే కళాకారుడి ప్రతిభను గుర్తించడంతో పాటు డాలర్లను వెచ్చించి ఆర్థికంగానూ ప్రోత్సహిస్తారని చెప్పారు. ప్రస్తుతానికి తాను ఆర్థికపరంగా కన్నా 'కళారాధకులు' ప్రశంసలపరంగానే సంతృప్తిని చెందుతున్నానన్నారు. అలాగే నాటకాలకు సీన్లు వేసివ్వటంలో దిట్టగా ప్రసిద్ధికెక్కిన ఈయన చిత్రీకరించిన నాటకం సెట్లకూ మంచి గిరాకీ వుండటం విశేషం. ఒక్కొక్క నాటకం తెర వెయ్యడానికి దాదాపు ఇరవై రోజులపైనే పడుతున్నప్పటికి శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందని ఆనందం వెలిబుచ్చారు. వారికి తగ్గట్టుగానే వారి పిల్లలు లక్ష్మి, శ్రావణిలు కూడా చిత్రకళలో ప్రవేశం కలిగి వుండటం, చెప్పుకోతగ్గ మరో విశేషం. అతి చిన్నవయసులోనే సృజనాత్మకతమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన రాంబాబు, కళారాధకుల ప్రశంసలందుకుంటూ చిత్ర కళారంగంలో తనకంటూ ఒక ప్రత్యేక శైలి ఏర్పరచుకుంటూ ముమ్ముందు మరిన్ని విజయాలను కైవసం చేసుకోవాలని ఆశిద్దాం.

సౌందర్య రాశీ!

జీవితమంటోంది...
ఇంత గొప్ప సౌందర్యభారాన్ని మోయలేనని
ఈమె దివ్యసంబంధీ భువినుంచి తీసుకోమని...
మరణమంటోంది...
కర్తవ్య నిర్వహణకు తాను సిద్ధమేననీ
ఆమెను నాకిమ్మని..
లక్షల అభిమానుల ప్రసిద్ధ తారా
నిన్నే ధ్యానిస్తూ నీకై పరితపిస్తున్నామే
దాన్నిప్పుడు నీ ప్రభునికి తిరిగి సమర్పించేసి
ఆయన ఆకాశంలో ప్రజ్వరిల్లే ప్రసిద్ధ తారవయ్యావా...
వేటాడే రంగుల ఉత్తేజం నిను సంఘర్షణలలోకి
వీలున్నప్పుడల్లా నీ ప్రతి శ్వాసపు నాళాన్నీ
ఆహ్లాదంగా నులిమేసిందా... మీనా...
వేటాడే జీవితం వెంటే నీవెళ్ళినా
నిను మోహించిన ఆ మరణాన్ని గ్రహించలేదు కదూ...
నీ ప్రేమకే బానిసలైన వేలాదిమందికి
ఆ కన్యదూతల సమూహాల హర్షధ్వనులు
వినిపిస్తూనే వున్నాయి...
నీకే తెలియని అమరత్వం నీలోనే దాగి వుందనీ
స్వచ్ఛమైన స్వర్గం నీ ఆతిథ్యంలోనే ఉందనీ
వారెన్నటికీ తెలుసుకోలేరు.
నీ జీవితం ఓ చిత్రహింస కదూ
అది చిత్రహింసనే చిత్రవధ గావించింది
శోకాన్నే మనువాడిన నీ ముఖ ప్రసన్నత్వంతో
వేదనాభరితమైన జీవితంతో
ఫలోద్యానవనాన్నే ఏర్పరిచావా భావి యువ కళాకారులకై...
సౌందర్యరాశీ! ఓ తీయని చంద్రమా!
సౌందర్యరాశీ! మానవజగత్తున ఉద్భవించిన సౌందర్యమా...
నిన్నెంతగానో ప్రేమించే మా ప్రతి హృదయం
సుధీర తీరాలకు వెళ్ళావనే అంటున్నా
నీవెక్కడికెళ్ళగలవ్!
అదుగో...
ఎదబాటు ద్వారంగా హృదయంలో
కాపురముండటానికే వచ్చేశావ్!

- మూలం : హరీంద్రనాథ్ చటోపాధ్యాయ్
అనువాదం : డాక్టర్ ప్రత్తిపాటి మాత్యు

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఆస్తిపంచరు... ఏం చెయ్యాలి?

నాకు 1983న పెళ్ళయింది. మా వారికి ఒక అన్నయ్య. ఒక చెల్లి, ప్రస్తుతం మామగారు మాత్రమే వున్నారు. పిత్రార్జితపు ఆస్తులు వున్నా మా పెళ్ళయి 20 సంవత్సరాల నుంచి ఆస్తి పంచక, దానిమీద ఆదాయమంతా ఆయనే వాడుకుంటున్నాడు. మమ్మల్ని 20 సంవత్సరాల నాడే కట్టుబట్టలతో బయటకు పంపారు. మా బావగారు ఎస్‌బిహెచ్‌లో బ్యాంకు మేనేజరు. వేరే వూర్లో వుంటారు. గతంలో మూడు సార్లు వ్యాపారం నిమిత్తం డబ్బు కావాలని మామగారిని అడిగితే మా బావగారు ఇవ్వనివ్వలేదు. ఆయన వద్ద డబ్బు లేదు మీరెందుకు అడుగుతారని పోట్లాడారు. తర్వాత ఏడాదికే మా ఆడపడుచుకు 3 లక్షలతో ఇల్లు కట్టించి, ఆమె పిల్లలకు కట్నమిచ్చి పెళ్ళి చేశారు. మామగారు మా ఆడపడుచుకు 1975లో పెళ్ళయింది. అప్పుడు కట్నం ఇచ్చి మళ్ళీ రెండోసారి కట్నంగా ఇచ్చారు. మాకు మాత్రం ఏమీ సహాయం చెయ్యట్లేదు. మామగారేమో పెద్దబ్బాయి ఇష్టం అంటారు. ఆయనేమో మా నాన్న ఇష్టం అంటారు. ఇద్దరూ డ్రామా ఆడుతున్నారు. ఉమ్మడి ఆస్తి అయినందువల్ల వారే పని చేసినా మేము అదేవూర్లో వుంటున్నా కనీసం చిన్నకొడుక్కి విషయం చెబుదామని తండ్రికాని, పెద్ద కొడుకు కాని అనుకోరు. అంతా రహస్యంగా చేస్తారు. మా వరకు ఏమీ చెప్పరు. మా పిల్లలకు చదువుకి కూడా సాయం చెయ్యరు. నాకు ఇద్దరబ్బాయిలు. 20, 17 సంవత్సరాలు. వారి నాటకం ఏమిటో అర్థం కాక ఇలా రాస్తున్నాను. మామగారు పెద్దకొడుకు లేనిదే నోరు మెదపరు. ఇదేం న్యాయం? ఇదేం ధర్మం, చనిపోవాలనుంది.

– ఎస్.శోభారాణి, నున్న

శోభగారు మీ సమస్య బహుశ ఇప్పటిదే కాదు. మీరు చెప్పిన విధంగా మీకున్న సదరు ఆస్థి పిత్రార్జితమయితే మీ మామగారి మీద మీ వారు పార్టిషియన్ దావా వేసి తనకు రావలసిన భాగం చట్టపరంగా పొందగలుగుతారు. మీ ఆడపడుచుకు రెండుసార్లు కట్నం ఇచ్చారన్నారు. పెళ్ళప్పుడు పసుపు కుంకుమ కింద ముట్టచెప్పి ఉంటారు. రెండవసారి వారి అమ్మాయిల పెండ్లికి బహుమతిగా ఇచ్చి ఉంటారు కాని కట్నంగా కాదు గదా. మీరు ఆయనను ఒప్పించి తీసుకోగలిగితే మీరు ఎంతైనా తీసుకోగలిగే వారు. ఆ పరిస్థితి లేదంటే దావా వేసి భాగం పంచుకోవాల్సిందే.

ఆస్రా ఇండియా - కేసు

నేను 'ఆస్రా ఇండియా' అనే రెసిడ్యుయిరి నాన్‌బ్యాంకింగ్ కంపెనీయందు ఏజెంటుగా పని చేసి దినసరి ఖాతా, ఫిక్సడ్ డిపాజిట్‌ల ద్వారా మూడు లక్షల రూపాయలు చేయించాను. నేను, నా ఖాతాదారులు ఆర్థికంగా లక్షలాది రూపాయలు నష్టపోయాము. ఈ సంస్థపై ఆర్.బి.ఐ. 2001 మార్చి 31 తేదీన నిషేధం విధించింది. ఈ చర్య ద్వారా సంస్థ మూతబడింది. ఈ సంస్థకు చెందిన కోట్లాది రూపాయల ఆస్తులు హైదరాబాద్ పరిసరాల్లో వున్నాయి. ఆర్.బి.ఐ. ఆస్రా ఇండియా సంస్థకి మధ్య హైకోర్టునందు కేసు నడుస్తున్నట్లు తెలిసింది. దయచేసి మేము మా డబ్బులు పొందే మార్గాలు, దయతో మీ పరిధిలో సంస్థ గురించి విచారించి తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

– ఎం.హుసేన్‌ఖాన్, నార్పల, అనంతపురం.

బ్యాంకింగ్, నాన్‌బ్యాంకింగ్ సంస్థల యొక్క పనితీరు ప్రస్తుతం మీరు ప్రతిరోజు ఏదో ఒక ఊర్లోగాని, పేపర్లలో చూస్తునే ఉంటుంటారు. ఆర్.బి.ఐ. ఇచ్చిన ఆదేశాలకు లోబడి వ్యాపారం చేయకుంటే నిషేధించే అధికారం ఆర్.బి.ఐ.కి ఉన్నది. మీరు చెప్పినదాన్ని బట్టి ఆ ఆదేశాన్ని 'ఆస్రాఇండియా' ప్రశ్నించినట్లు కనబడుతుంది. మీరు ఆ బ్రాంచినిగాని, సదరు కంపెనీ ప్రధాన శాఖను కాని సంప్రదిస్తే ఆ కేసు పూర్వాపరాలు తెలియగలవు. కేసు, ఏమిటో తెలవకుండా హైకోర్టులో దీనిని తెలుసుకోవడం చాలా కష్టం. మీరు కంపెనీ ఆఫీసులో తెలుసుకోగలరు. సరైన ఆస్తులు కంపెనీకి ఉంటే డిపాజిటర్స్ తమ డబ్బును తిరిగి పొందగలరు.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు

ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి దినపత్రిక,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

హ్యాపీబర్త్‌డే

(19-9-2004 నుంచి 25-9-2004 వరకు)

యస్.చెల్లి
4సం॥, 21.9.2000
విజయమ్మ-రవికుమార్
బుధవారంపేట-కర్నూలు

జి.నిఖిత హేమని
3సం॥, 23.9.2001
లక్ష్మీలావణ్య-చంద్రశేఖర్
కనకవీధి-విశాఖపట్నం

ఎమ్.ఉమర్ ఫారుక్
1సం॥, 24.9.2003
హసీనాబాను-అల్తాఫ్ హుస్సేన్
పాణ్యం-కర్నూలు

చైతన్య(చిక్కి)
2సం॥, 24.9.2002
వాసవి-రామయ్య
రాఘవపురము-నల్లగొండ

మానస
4సం॥, 25.9.2000
రమాదేవి-ఏడుకొండలు
పెదకాకాని-గుంటూరు

ఎస్.సౌమ్య
10సం॥, 25.9.1994
అనంతలక్ష్మి-హనుమంతరావు
అద్దంకి-ప్రకాశం

ప్రభంజన్
8సం॥, 25.9.1996
లత-వెంకట్‌గౌడ్
కల్వకుర్తి-మ॥నగర్

భీష్మబ్రహ్మణి
3సం॥, 25.9.2001
కల్పన-బాలకృష్ణ
నాగర్‌కర్నూలు-మ॥నగర్

నయోమే
9సం॥, 25.9.1995
శ్రీదేవి-సంగమేష్
పాలకొండ-శ్రీకాకుళం

మధుమిత
4సం॥, 25.9.2000
సీతామహాలక్ష్మి-అంజిరెడ్డి
నరసరావుపేట-గుంటూరు

డి. లిఖిత్‌రెడ్డి
2సం॥, 25.9.2002
అనూరాధ-శ్రీకాంత్‌రెడ్డి
హైదరాబాద్

ప్రచాత్
6సం॥, సెప్టెంబర్-1998
సునంద-బాబురావు
విజయవాడ

వెంపటి మేఘన
1సం॥, సెప్టెంబర్-2003
రమ-వీరయ్య
జగన్నాథపురం-నల్లగొండ

కె.నవ్యశ్రీ
2సం॥, సెప్టెంబర్-2002
గోవిందమ్మ-మనోహర్
షాబాద్-రంగారెడ్డి

పి.ఎస్.హారిణి
సెప్టెంబర్
సుకన్య-నరసింహ
మారుతీనగర్-హైదరాబాద్

సృజన్ ప్రతీక్
సెప్టెంబర్
సుహాసిని-ప్రభాకర్
నారాయణ్‌పేట్-మ॥నగర్

ఎన్. ప్రత్యూష
6సం॥, సెప్టెంబర్-1998
వజ్రాంజని-వెంకటేశ్వర్లు
ఐలవరం-గుంటూరు

భాను తేజ
1సం॥, సెప్టెంబర్-2003
సుజాత-అనంతయ్య
నానక్‌నగర్-రంగారెడ్డి

బేబీగ్రీష్మ (బీటి)
2సం॥, సెప్టెంబర్-2002
మంజుల-రామకృష్ణ
నాగర్ కర్నూలు-మ॥నగర్

సుప్రజ
1సం॥, సెప్టెంబర్-2003
యశోద-వెంకటస్వామి
శింగాయిపల్లి-మ॥నగర్

అనుకుల ని తిన్
సెప్టెంబర్
సత్యవతి-నగేష్‌కుమార్
ఏడిద-తూ॥గో

పెసర పూర్ణాలు

కావలసిన వస్తువులు:

పెసరపప్పు	:	1/2 కేజి
కొబ్బరికాయ	:	1
నూనె	:	1/2 కేజి
బెల్లం	:	1/2 కేజి
ఏలకులు	:	10
మైదా	:	1/2 కేజి

తయారు చేసే విధానం:

ముందు పెసరపప్పు రాళ్ళు లేకుండా శుభ్రం చేసుకోవాలి. 1 గంట నానపెట్టాలి. దీనిని గట్టిగా నీళ్ళు పోయకుండా పలుకుగా రుబ్బుకోవాలి. ఈ పిండిని కుక్కర్ గిన్నెలో ఆవిరి మీద ఉడికించుకోవాలి. ఈ పిండి ఉడికి ఆరిన తరువాత పొడిపొడిగా నలుపుకోవాలి. కొబ్బరి తురుముకోవాలి. ఏలకులు పొడికొట్టాలి. బెల్లం తరగాలి. పెసరపిండిలో బెల్లం, కొబ్బరికోరు, యాలకుల పొడి వేసి కలిపి నిమ్మకాయంత సైజులో ముద్దలు చేసుకోవాలి. మైదాపిండిని శుభ్రంగా జల్లించుకొని నీళ్ళు పోసి బజ్జీల పిండిలాగ కలుపుకోవాలి. పొయ్యిమీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనె కాగిన తరువాత పెసర పూర్ణాన్ని మైదాపిండిలో ముంచి నూనెలో వేయాలి. ఇవి వేగిన తరువాత తీసివేయాలి. ఇవి వారం రోజులు వున్నా పాడుకావు. ఇలాగే పెసరపప్పు బదులు, పచ్చిశనగపప్పుతో కూడా చేసుకోవచ్చు.

కొబ్బరి కుడుములు

కావలసిన వస్తువులు:

కొబ్బరికాయ	:	1
బెల్లం	:	1/4 కే.జి.
పచ్చిశనగపప్పు	:	50 గ్రా.
బియ్యం పిండి	:	1/2 కే.జి.
ఏలకులు	:	5

తయారు చేసే విధానం:

ఒక గ్లాసు నీళ్ళు పొయ్యి మీద పెట్టి బాగా కాగిన తరువాత బెల్లం తరిగి కలపాలి. రెండు పొంగులు వచ్చాక అందులో నానపెట్టిన పచ్చిశనగపప్పు కలపాలి. కొబ్బరి తురుము, బియ్యం పిండి వేసి కలపాలి. యాలకులపొడిని ఈ మిశ్రమానికి కలిపి కుడుములుగా చేసుకోవాలి. దీనిని జిల్లేడుకాయల ఆకారములో కూడా చేసుకోవచ్చు. వీటిని ఇడ్లీ కుక్కర్లో పెట్టి ఉడికించుకోవాలి. వేడిమీద చాలా మృదువుగా బావుంటాయి. రెండు మూడు రోజులు నిల్వ ఉంటాయి. తినబోయే ముందు మరల కుక్కర్లో పెట్టి వేడి చేసుకుంటే అప్పుడు వండిన వాటిలాగే ఉంటాయి. దీనిలో నూనె ఉపయోగించం కాబట్టి ఆవిరి మీద ఉడికించటం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. బలవర్ధకమైన ఆహారం కూడా.